18,04,229

- ఇదీ జిల్లా ఓటర్ల లెక్క
- మహిళలు 9,25,735, పురుషులు 8,78,321
- అత్యధికంగా చంద్రగిరిలో 3,14,230
- గతేడాదితో పోల్చితే తగ్గిన 8,751 మంది

తిరుపతి (కలెక్టరేట్), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తుది ఓటర్ల జాబితాను కలెక్టర్ వెంకటేశ్వర్లు సోమవారం విడుదల చేశారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 18,04,229 మంది ఓటర్లు ఉన్నట్లు వెల్లడించారు. ఎప్పటిలాగే మహిళా ఓటర్లే అధి



కారంగా ఉన్నారు. వీరి సంఖ్య 9,25,735. పురుషులు 8,78,321 మంది ఉన్నారు. 47,414 మంది మహిళలే ఎక్కువ. ట్రాన్స్‌జెండర్స్ 173 మంది ఉన్నారు. మొత్తం 2,141 పోలింగ్ కేంద్రాల పరిధిలో 18,04,229 మంది ఓటర్లుగా చేరింది. ఇక సర్వీసు ఓటర్లు 823మంది ఉన్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో ఏప్రిల్ 26నాటికి అప్పటి జిల్లా యంత్రాంగం ప్రకటించిన ఓటర్ల సంఖ్య 18,12,980. గతేడాదితో పోలిస్తే ఇప్పుడు 8,751మంది ఓటర్లు తగ్గారు. ఒక్క తిరుపతి నియోజకవర్గంలోనే సుమారు 6 వేల ఓటర్లు తగ్గడం విశేషం. గూడూరు, చంద్రగిరిలో వెయ్యేసి.. సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి, సత్యవేడులో సుమారు 800 ఓట్లు చొప్పున తగ్గాయి. గతేడాది ఎన్నికల ముందు దొంగ ఓట్లు భారీగా చేర్పించారని అప్పట్లో టీడీపీ నేతలు అధికారులకు పదే పదే ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. అప్పటి యంత్రాంగం పట్టించుకోకపోవడంతో దొంగ ఓట్లు చేరాయని వీరు ఆరోపించారు. ఇప్పుడు ఆ దొంగ ఓట్లు తగ్గాయని అంటున్నారు.

ఆగస్టు నుంచి ఓటర్ల జాబితా సవరణ

జిల్లాలో ఆగస్టు 20 నుంచి ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ మొదలైంది. బీఏల్వోలు ఇంటింటికి వెళ్లి ఓటర్ల సమాచారాన్ని ధ్రువీకరించారు. గతంలో జరిగిన పొరపాట్లను గుర్తించారు. డెత్, షిఫ్టింగ్ ఓటర్లను తొలగించారు. ఓటర్ల అభ్యంతరాలను స్వీకరించారు. సాధ్యమైనంత వరకు దొంగ ఓట్లను తొలగించారు. కాగా, కొత్తగా సుమారు 4వేల మంది ఓటర్లు నమోదుకాగా, అందులో 18 ఏళ్ల వారు 1300 మంది ఉన్నారు.

ప్రస్తుతం జిల్లాలో నియోజకవర్గాల వారీగా ఓటర్ల సంఖ్య

అసెంబ్లీ నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం ఓటర్లు
గూడూరు	294	1,18,874	1,25,917	34	2,44,825
సూళ్ళూరుపేట	304	1,17,658	1,24,170	20	2,41,848
వెంకటగిరి	298	1,19,088	1,24,908	4	2,44,000
చంద్రగిరి	398	1,52,510	1,61,661	59	3,14,230
తిరుపతి	274	1,46,486	1,50,013	32	2,96,531
శ్రీకాళహస్తి	294	1,19,629	1,28,306	13	2,47,948
సత్యవేడు	279	1,04,076	1,10,760	11	2,14,847
మొత్తం	2,141	8,78,321	9,25,735	173	18,04,229



తిరుపతి సబ్ జైలులోకీ గంజాయి!

వాయిదాలకు వచ్చినప్పుడు పొడి రూపంలో తీసుకెళుతున్న రిమాండ్ ఖైదీలు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): తిరుపతి సబ్‌జైలులోకీ గంజాయి చేరుతోంది. వాయిదాలకు వచ్చే సమయంలో అధికారుల కళ్లుగప్పి రిమాండ్ ఖైదీలు తీసుకెళుతున్న ఘటనలున్నాయి. విశాఖ సబ్ జైలులో గంజాయి కలకలం రేగిన నేపథ్యంలో తిరుపతి సబ్ జైలులోనూ అటు ఇటుగా గంజాయి చేరుతున్నట్లు తెలిసింది. ఇక్కడి సబ్ జైలు సామర్థ్యం దాదాపు 120 మందికే. కానీ, ప్రస్తుతం 140 మంది వరకున్నారు. వీరిలో కనీసం 20 నుంచి 30 మంది గంజాయితో పాటు వివిధ రకాల మత్తు పదార్థాలకు అలవాటు పడిన వారున్నట్లు తెలిసింది. వీరిలో కొందరిని వాయిదాల కోసం ప్రత్యేక ఎస్కార్టుతో ఇతర జిల్లాల్లోని న్యాయస్థానాలకు తీసుకెళ్లి హాజరుపరుస్తుంటారు. అక్కడ ఉదయం నుంచి సాయంత్రం వరకు వేచి ఉన్న సమయంలో వారి స్నేహితులు, బంధువులు కొందరు వీరితో మాట్లాడేందుకు వస్తుంటారు. ఆ సమయంలో రిజర్వు కానిస్టేబుళ్ల కళ్లుగప్పి గంజాయి పొడిని రిమాండు ఖైదీలకు ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ప్యాకెట్లను గుట్టుచప్పుడు కాకుండా వీరు బ్యారక్‌లకు తీసుకెళుతున్న ఘటనలు తరచూ చోటు చేసుకుంటున్నాయి. రాత్రిళ్లు వీరు గంజాయి తీసుకుంటున్నట్లు సమాచారం. ఇక, రిమాండ్ ఖైదీలకు గంజాయి సరఫరా చేయడానికి ప్రత్యేకంగా కొన్ని బ్యాచ్‌లు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. వీళ్లు ఇక్కడికి తీసుకొచ్చి చేరిస్తే రూ.వెయ్యి ముట్టచెపుతున్నట్లు సమాచారం. తరచూ అధికారులు తనిఖీ చేసి కొన్ని ప్యాకెట్లను గుర్తించి పడేస్తున్నా.. ఇంకొన్ని కనపడకుండా రిమాండ్ ఖైదీలు జాగ్రత్త పడుతున్నారు. నెలలో ఐదు నుంచి 10 మంది నుంచి గంజాయి పొడి ప్యాకెట్లు తీసి బయట పడేస్తున్నా.. వారిలో మార్పు రాకపోవడం గమనార్హం. కాగా, రాత్రిళ్లు కొందరు బయట నుంచి.. కొన్ని ఇళ్లపైకి వెళ్లి సబ్‌జైలులోకి గంజాయి పొడి ప్యాకెట్లు విసురుతున్నట్లు సిబ్బంది గుర్తించినట్లు తెలిసింది. ఏమాత్రం అదమరిచినా ప్యాకెట్లు లోపల పడిపోతున్నట్లు తెలుస్తోంది. గతంలో ఇలా బీడీలను లోపలకు విసిరిన సందర్భాలున్నాయి. వీటిపై ఉన్నత స్థాయి అధ్యయనం చేసి సబ్‌జైలు లోపలకు గంజాయి రాకుండా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

పాత ఖైదీల పాత్ర ఎక్కువ



సబ్‌జైలులో ఉంటున్న పాత ఖైదీలు కొందరు గంజాయి పొడి ప్యాకెట్లు లోపలకు తీసుకొస్తున్నారు. వాయిదాలకు వెళ్ళి అక్కడ నుంచి ఎస్కార్టు కళ్ళు కప్పి ఏదో ఒక మార్గంలో గంజాయి పొడి తీసుకుంటున్నారు. ఎవరికీ కనిపించని ప్రాంతంలో పెట్టుకుని వస్తున్నారు. వీరిలో ఇప్పటికీ ఒకరిద్దరు ఉన్నారు. బయట వాయిదాలకు వెళ్ళి జైలులోకి వచ్చే సమయంలో తనిఖీ చేసిన సమయంలో దొరికితే మాత్రం తీసి పడేస్తున్నాం. ఇకపై ఖైదీలను గట్టిగా తనిఖీచేసి లోపలకు ఎట్టి పరిస్థితుల్లోనూ గంజాయి ప్యాకెట్లు తీసుకెళ్లకుండా కట్టడి చేస్తాం.

- గురుశేఖర్‌రెడ్డి, తిరుపతి సబ్ జైలు పర్యవేక్షణాధికారి

ఎలా ఉన్నారు? జాగ్రత్త!

చెన్నై, బెంగళూరుల్లో హెచ్‌ఎంపీవీ కేసుల నమోదుతో బంధువుల ఆందోళన

సూళ్లూరుపేట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): చెన్నై, బెంగళూరులో ఇద్దరు చొప్పున నలుగురు చిన్నారులకు హెచ్‌ఎంపీవీ వైరస్ సోకడంతో సూళ్లూరుపేటలో ఆందోళన మొదలైంది. బెంగళూరులో సాఫ్ట్‌వేర్ విభాగంలో ఈ ప్రాంతం వారు ఎక్కువ మంది ఉన్నారు. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు వారికి ఫోన్లు చేసి జాగ్రత్తలు చెబుతున్నారు. చెన్నైలోనూ ఈ ప్రాంతం నుంచి ఎక్కువ మంది వెళ్లి సెటిల్ కావడం.. వ్యాపార పరంగా ప్రతి అవసరానికీ అక్కడి వెళ్తుండటం.. ఈ క్రమంలోనూ ఆందోళన నెలకొంది. కొందరూ అధికారులు, పాఠశాలల నిర్వాహకులు మంగళవారం నుంచి మాస్కులు ధరించి రావాలని ముందుజాగ్రత్త చర్యగా చెప్పడం గమనార్హం. ఈ వైరస్ ప్రభావం పక్కుల పండుగపై పడుతోందన్న ఆందోళన కూడా వ్యక్తమవుతోంది. చిన్నారులపై దీని ప్రభావం ఎక్కువగా చూపే ప్రభావం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఈ వైరస్ సోకిన వారికి దగ్గు, జ్వరం, ముక్కు దిబ్బడగా అనిపించడంతో పాటు శ్వాస తీసుకోవడం ఇబ్బంది ఉండడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ లక్షణాలను ముందుగానే కొనుక్కొని వైద్య నిపుణుల సలహా మేరకు వైద్యం చేయించుకోవాలి. కరోనా లాగా ఇది వ్యాప్తి చెందకపోయినా అప్రమత్తంగా ఉంటే మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

సీఎస్ తహసీల్దారట!



సూళ్లూరుపేట డివిజన్‌కు చెందిన ఆ అధికారి డిప్యూటీ తహసీల్దారు మాత్రమే. కానీ కారులో ఇలా సివిల్ సప్లయస్ తహసీల్దారుగా బోర్డు పెట్టుకుని ప్రయాణాలు సాగిస్తుంటారు. తహసీల్దార్లకు టోల్ ప్లాజాలో రుసుం మినహాయింపు ఉంది. ఇలా టోల్ ఫీజు చెల్లించకుండా ఉండేందుకు ఈయనతోపాటు కొందరు ఇలాంటి బోర్డులను ఉపయోగిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. అసలు, సివిల్ సప్లయస్‌లో మండలస్థాయిలో డిప్యూటీ తహసీల్దార్లే ఉంటారు. జిల్లాలోనూ సీఎస్ తహసీల్దారు పోస్టే ఉండకపోవడం గమనార్హం. దీనిపై ఇటీవల టోల్‌ప్లాజాలో ప్రశ్నించినట్లు తెలిసింది.

- సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి

అన్‌స్టాపబుల్ కుప్పం!

మోడల్ నియోజకవర్గంగా సర్వతోముఖాభివృద్ధి



- రాష్ట్రానికి ముఖ్యమంత్రిని కానీ, మీకు ఎమ్మెల్యేనే
- స్వర్ణకుప్పం విజన్- 2029 ఆవిష్కరణలో సీఎం
- నడిమూరులో సోలరైజేషన్ పథకం ప్రారంభం
- నెట్ జీరో కాన్సెప్ట్‌పై కాన్పూర్ ఐఐటీతో ఒప్పందం

కుప్పం/గుడుపల్లె, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): 'కుప్పం అభివృద్ధిని ఇక ఎవరూ ఆపలేరు. అన్‌స్టాబుల్‌గా అభివృద్ధి చేసి చూపిస్తా' అని ముఖ్యమంత్రి చంద్రబాబు నియోజకవర్గ ప్రజలకు హామీ ఇచ్చారు. 'రాష్ట్రానికి ముఖ్యమంత్రిని కానీ, ముందుగా మీకు ఎమ్మెల్యేని. అందుకే కుప్పం సర్వతోముఖాభివృద్ధి నా బాధ్యత. మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్ది, రాష్ట్రానికే ఆదర్శంగా నిలుపుతా' అన్నారు. కుప్పం నియోజకవర్గ పర్యటనలో మొదటి రోజైన సోమవారం కుప్పం, గుడుపల్లె మండలాల్లో జరిగిన పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. తొలుత ద్రావిడ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో స్వర్ణకుప్పం విజన్- 2029 ఆవిష్కరించారు. ఇక్కడ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా విజన్ డాక్యుమెంట్‌తో కుప్పం భవిష్య అభివృద్ధిని వివరించారు. విద్యార్థులతో ముఖాముఖిలో పాల్గొన్నారు. అనంతరం కుప్పం మండలం నడిమూరులో పీఎం సూర్యఘర్ పథకం కింద సోలరైజేషన్ కార్యక్రమం ప్రారంభించి వేదికనుంచి ప్రసంగించారు. అంతకు ముందు ఆయన నెట్ జీరో కాన్సెప్ట్‌పై కాన్పూర్ ఐఐటీతో ప్రతినిధులతో ఒప్పందం కుదుర్చుకున్నారు. తర్వాత మండలంలోని శీగలపల్లెలో ప్రకృతి వ్యవసాయ రైతులతో ముఖాముఖి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ గత అయిదేళ్ల విధ్వంస పాలనలో కుప్పం అభివృద్ధి పూర్తిగా నిలిచిపోవడమే కాక, పదేళ్ల వెనక్కి వెళ్లిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే రెట్టించిన వేగంతో కుప్పం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడానికి స్వర్ణ కుప్పం విజన్‌తో ముందుకు వచ్చానన్నారు.గత పాలకులు కక్షపూరితంగా అభివృద్ధిని అడ్డుకోవడమే కాక, టీడీపీ కార్యకర్తలను ఇబ్బందులపాలు చేశారన్నారు. అయితే ఇక ఎవరూ కుప్పం అభివృద్ధిని ఆపలేరని,అది అలా అన్‌స్టాపబుల్‌గా ముందుకు సాగుతూనే ఉంటుందని ప్రకటించారు. 2024లో అధికారంలోకి వచ్చాక ఒకసారి కుప్పం వచ్చి వెళ్లానని గుర్తు చేసుకున్న చంద్రబాబు, అప్పుడు ప్రజలకు హామీ ఇచ్చినట్లుగా కడా ఏర్పాటు చేసి, తద్వారా అభివృద్ధికి శ్రీకారం చుట్టానన్నారు. పేదరికంలేని సమాజాన్ని ఇక్కడ సృష్టిస్తానని, ప్రతి కుటుంబమూ ఆర్థికంగా ఎదగడానికి అవసరమైన ప్రణాళికలు అమలుపరుస్తానని చెప్పారు. పెద్దయెత్తున పరిశ్రమలు స్థాపించి 15 వేల ఉద్యోగాలను కల్పిస్తామన్నారు. ఇందుకు నైపుణ్య శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తామని, ముఖ్యంగా ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం ద్వారా వారి స్వావలంబనకు చర్యలు తీసుకుంటానన్నారు.

జూన్‌కల్లా హంద్రీ-నీవా జలాలు

హంద్రీ-నీవా కుప్పం బ్రాంచి కెనాల్‌ను జూన్ నెలకల్లా పూర్తి చేసి నియోజకవర్గానికి సాగు, తాగునీటి వనరులు పుష్కలంగా అందేలా కృషి చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. హంద్రీ-నీవా జలాలను పాలారు నదికి తీసుకొస్తానన్నారు. ఈ నదిపై చెక్‌డ్యామ్‌లు మరిన్ని నిర్మించి నీటిని నిల్వ చేసి కుప్పంలో బంగారు పంటలు పండించేలా చూస్తానన్నారు. వ్యవసాయాన్ని కూడా అత్యాధునిక సాంకేతికత వినియోగంతో లాభసాటిగా మారుస్తామని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో డీప్ టెక్నాలజీదే హవా అని పేర్కొన్నారు. ఎన్టీఆర్ మానసపుత్రిక అయిన ద్రావిడ విశ్వవిద్యాలయం వైసీపీ రాజకీయానికి బలైందని ఆవేదన వ్యక్తం చేశారు. ద్రావిడ వర్శిటీతో పాటు ఇతర వర్శిటీల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టి, అభివృద్ధి దిశగా పరుగులు పెట్టిస్తానన్నారు. నెట్ జీరో కుప్పం ప్రజలకు చంద్రబాబు హామీ ఇచ్చారు.



చంద్రబాబుపై వెల్లువెత్తిన అభిమానం



నడిమూరులో చంద్రబాబుతో విక్టరీ సంకేతాన్ని చూపిస్తున్న చిన్నారి

సోలరైజేషన్ ఒక చరిత్ర

నడిమూరులో సోలరైజేషన్ కార్యక్రమం ప్రారంభించడం ఒక చరిత్రని చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్రంలోనే తొలుత ఈ పథకాన్ని ప్రారంభించిన నడిమూరు చరిత్రలో మిగిలిపోతుందన్నారు. నెట్ జీరో కాన్సెప్ట్‌కు సంబంధించి కాన్పూర్ ఐఐటీతో కుదిరిన ఒప్పందంతో కాలుష్య రహిత కుప్పాన్ని నిర్మిస్తామని, ప్రజలను సంపూర్ణ ఆరోగ్యవంతులను చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సైకిళ్ల వంటివాటి ద్వారా కర్బన ఉద్గారాలను అరికడతామని చెప్పారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఎమ్మెల్యేలు అమరనాథరెడ్డి, పులివర్తి నాని, గాలి భానుప్రకాష్, కోనేటి ఆదిమూలం, గురజాల జగన్మోహన్, డాక్టర్ థామస్, మురళీమోహన్, టీటీడీ ఛైర్మన్ బీఆర్.నాయుడు, కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, కలెక్టర్ సుమిత్ కుమార్, కడా పీడీ వికాస్ మర్మత్, ఎస్పీడీసీఎల్ అధికారులు, రెస్కో ఎండీ సోమశేఖర్‌తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం.. ఆదాయం

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్య సమాజం రూపొందుతుందని, రైతుకు ఆదాయం సమకూరుతుందని సీఎం చంద్రబాబు అన్నారు. శీగలపల్లెలో ప్రకృతి వ్యవసాయదారులతో సాయంత్రం ఆయన ముఖాముఖిలో పాల్గొన్నారు. ప్రకృతి ఉత్పత్తులకు డిమాండ్ ఉన్నందున మార్కెటింగ్ బాగా జరుగుతుందని, అధిక లాభాలు ఆర్జించవచ్చన్నారు. 100 రూకార్ట్ సబ్జీ కూలర్లను తీసుకొస్తామని, వాటిల్లో కూరగాయలు, పండ్లు, పూలు వారంపాటు తాజాగా ఉంటాయన్నారు. వీటి పనితీరు చూశాక మరిన్ని తీసుకొస్తామని చెప్పారు.

చంద్రగిరి

పంచాయతీకి తొలగిన అద్దె ట్రాక్టరు అవస్థ


ట్రాక్టరు అందజేత కార్యక్రమంలో ఎంపీడీవో గిడ్డయ్య

భాకరాపేట, జనవరి 6(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేట గ్రామ పంచాయతీకి అద్దె ట్రాక్టరు ఇబ్బంది తొలగిపోయింది. సోమవారం స్వచ్ఛ భారత్ మిషన్ పథకం కింద ఒక కొత్త ట్రాకరును సమకూరిందిరు. ఇన్నాళ్లూ చెత్త తరలించడానికి ట్రాక్టరు లేకపోవడంతో వేలాది రూపాయలు వెచ్చించి అద్దె ట్రాక్టరు ఉపయోగించుకునేవారు. ఎమ్మెల్యే పులివర్తి నాని జిల్లా అన్నతాధికారులతో మాట్లాడి స్వచ్ఛ భారత్ మిషన్ కింద ట్రాక్టరును మంజూరు చేయించారు. సోమవారం స్థానిక కోదండ రామస్వామి ఆలయంలో ఎంపీడీవో గిడ్డయ్య పూజలు చేయించి పంచాయతీ కార్యదర్శి రామ్మోహన్‌కు దానిని అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు బెల్లంకొండ మురళీ, నాయకులు సుబ్రహ్మణ్యం, దామోదర, లోకనాథం, వెంకటరత్నం, డిష్ మణి, సిద్దముని, మునిచంద్ర, రాజశేఖర్, రఘునాథ్, గురుప్రకాశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



భాకరాపేట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ రూపొందించిన కొత్త సంవత్సర డైరీ, క్యాలెండర్లను సోమవారం ఎంఈవో-2 గోపీనాథ్ ఆవిష్కరించారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో యూటీఎఫ్ చేస్తున్న కృషిని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్షులు తారకనాథ్, ప్రధాన కార్యదర్శి శిరీష, నాయకులు చంద్రయ్య, వెంకటరమణ పాల్గొన్నారు.

రేపటినుంచి మహాభారతంపై జాతీయ సదస్సు

పాకాల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం, గురువారాల్లో మహాభారతంపై జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ మోహిద్దీన్ బాషా తెలిపారు. కళాశాల తెలుగు విభాగం, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం (నెల్లూరు), పాశ్చ్య పరిశోధన సంస్థ, శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం (తిరుపతి), మాడభూషి సాహిత్య కళా పరిషత్ (చెన్నై)ల సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. వివిధ విశ్వవిద్యాలయాల ఆచార్యులు, వివిధ కళాశాల అధ్యాపకులు పాల్గొంటారన్నారు. తెలుగు అధ్యాపకుడు డాక్టర్ ఈశ్వరబాబు సదస్సు సంచాలకుడిగా వ్యవహరిస్తారని తెలిపారు.

వైభవంగా కోటి లింగేశ్వరస్వామి మండలాభిషేకం



రామచంద్రాపురం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): రాయలచెరువు కట్ట భవానీ జలకంఠేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్మించిన కామాక్షి సమేత కోటిలింగేశ్వరాలయంలో సోమవారం మండలాభిషేకం వైభవంగా జరిగింది. వేదపండితులు కలశప్రతిష్ఠ, గణపతి, మృత్యుంజయ, రుద్రహోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఒకే గర్భాలయంలో ప్రతిష్ఠించిన 108 శివలింగాలతో పాటు కామాక్షి అమ్మవారికి ప్రవిత్రజలాలతో సంప్రోక్షణ చేశారు. సుగంధ పరిమళ ద్రవ్యాలతో స్వామి అమ్మవార్లకు తిరుమంజనం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. వందలాది మంది భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఉభయదాతలు బ్రహ్మానందరెడ్డి, భాస్కర్‌నాయుడు, అబ్బూరి దేవరాజు పాల్గొన్నారు.

లేఅవుట్ గోడ కూల్చివేతకు యత్నం

చంద్రగిరి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): బందార్లపల్లెలో సోమవారం ఓ లేఅవుట్ గోడ కూల్చివేతకు పంచాయతీ అధికారులు ప్రయత్నాన్ని బాధితులు అడ్డుకున్నారు. తొలుత పోలీసులను తీసుకుని కొటాల పంచాయతీ కార్యదర్శి లేఅవుట్ వద్దకు వెళ్లారు. గ్రామానికి చెందిన ఉమామహేశ్వరి ఆమె కుమారుడు వారిని అడ్డుకున్నారు. ఉమామహేశ్వరి మాట్లాడుతూ కొందరు వ్యక్తులు తమ లేఅవుట్ నుంచి దారి కోసం కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. తుడా ప్లాన్ ప్రకారం లేఅవుట్ ప్రక్రియ ప్రారంభించామన్నారు. ప్లాన్ మార్పు కోసం దరఖాస్తు చేస్తే తుడా నుంచి నోటీసులు వచ్చాయని పంచాయతీ కార్యదర్శి చెప్పారన్నారు. మూడు నెలల క్రితం నోటిసులు వస్తే ఇప్పటి వరకు చూపకుండా గోడ కూల్చేందుకు ప్రయత్నించడం తగదన్నారు.


మామిడి సస్యరక్షణపై రైతులకు శిక్షణ



రామచంద్రాపురం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మామిడి పంటలో సస్యరక్షణ పాటించాలని రాస్ ఉద్యాన శాస్త్రవేత్త సుధాకర్ సూచించారు. మండలంలోని సీకేపల్లి పంచాయతీ రైతు సేవా కేంద్రంలో మామిడి సస్యరక్షణపై సోమవారం రైతులకు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. అధిక వర్షాలతో పూత రావడం ఆలస్యమవుతుందన్నారు. ఇందుకు రైతులు తీసుకోవాల్సిన మందులను సూచించారు. ఉద్యాన అధికారి సునీల్ మాట్లాడుతూ ప్రభుత్వం రాయితీతో మామిడి పండ్ల కవర్లను ఇస్తుందన్నారు. రైతులు సమీపంలోని రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌కే అసిస్టెంట్ సుకన్య, రైతులు పాల్గొన్నారు.

ఆరో రోజుకు 'కానిస్టేబుల్' ఎంపిక ప్రక్రియ

చిత్తూరు అర్బన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కానిస్టేబుల్ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ ఆరో రోజు కూడా స్థానిక పోలీసు పరేడ్ మైదానంలో కొనసాగింది. సోమవారం జరిగిన ప్రక్రియలో 609 మంది అభ్యర్థులకుగాను 399 మంది హాజరవగా, 217 మంది రాతపరీక్షకు అర్హత సాధించారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ మొదలు బయోమెట్రిక్ అథెంటికేషన్, ఫిజికల్ మెజర్మెంట్‌లో భాగంగా 1600 మీటర్లు, 100 మీటర్ల పరుగు పందెం, లాంగ్‌జంప్‌ను నిర్వహించారు. పరుగుపందెంలో అలసిన అభ్యర్థులకు వైద్యులు ప్రథమచికిత్స అందించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ కానిస్టేబుళ్ల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా, అభ్యర్థుల ప్రతిభ ఆధారంగానే జరుగుతుందని చెప్పారు. అభ్యర్థులు, తల్లిదండ్రులు దళారులను, మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్పీ వి.రత్న, ఏఆర్ ఏఎస్పీ శివానంద కిశోర్, టౌన్ డీఎస్పీ సాయినాథ్, ఏఆర్ డీఎస్పీలు చిన్నికృష్ణ, జయరామయ్య పాల్గొన్నారు.


రెండు రోజుల పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి సోమవారం కుప్పంలో స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే పులివర్తినాని

మహిళ అదృశ్యంపై పోలీసులకు ఫిర్యాదు


సరస్వతి(ఫైల్ ఫొటో

భాకరాపేట, జనవరి 6(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలం తాటిగుంటపల్లెకు చెందిన చీమల మర్రి వెంకటరమణ భార్య సరస్వతి కనబడడం లేదని కుటుంబసభ్యులు పోలీసుకలు ఫిర్యాదు చేశారు. కుటుంబ కలహాల వల్ల శుక్రవారం నుంచి కనపడడం లేదన్నారు. బంధువులు, సన్నిహితుల ఇళ్లలో వెతికినా కనబడలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు తనకు 9440900711 నంబరకు సమాచారం అందజేయాలని ఎస్ఐ రాఘవేంద్ర కోరారు.

మండల రెవెన్యూ అసోసియేషన్ కార్యవర్గం



చంద్రగిరి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండల రెవెన్యూ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సోమవారం చంద్రగిరి తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, వీఆర్ఏలు, రెవెన్యూ సిబ్బంది సమావేశమయ్యారు. అసోసియేషన్ మండల అధ్యక్షుడిగా కె.సిద్దయ్య, కార్యదర్శిగా యజ్ఞశ్రీ, ఉపాధ్యక్షుడిగా విష్ణువర్ధన్, సంయుక్త కార్యదర్శిగా గిరి, కోశాధికారిగా రెడ్డిప్రసాద్‌లను ఏకగ్రీవకంగా ఎన్నుకున్నారు.

చేపల వేటకు చెరువులో దిగి ఒకరు మృతి


చెరువులో వెంకట్రామణ మృతదేహం

ఎర్రావారిపాలెం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): చేపల వేటకు చెరువులో దిగి ప్రాణాలు కోల్పోయాడో వ్యక్తి. బోడేవాండ్లపల్లె గ్రామం తోటి హరిజనవాడకు చెందిన కే వెంకట్రామణ(50) సోమవారం ఊరికి దగ్గరలోని చిన్నప్ప చెరువుకు వెళ్లాడు. చేపలు పట్టేందుకు దిగాడు. లోతున్న ప్రాంతంలో ఈత సరిగా రాక మునిగి చనిపోయాడు. అతనికి భార్య చంద్రమ్మ కువాయిట్‌లో ఉంది. ముగ్గురు కుమార్తెలు. వీరికి వివాహమైనది. మృతుని తండ్రి నారాయణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ● నెరబైలు పంచాయతీ కందల మాదిగ పల్లెకు చెందిన రాజశేఖర్ ఊరికి సమీపంలోని వాగులో శవమై తేలాడు. వారం రోజులుగా ఇతను కనిపించడం లేదని గ్రామస్తులు చెప్పారు.

వెండి కవచాల బహూకరణ



తిరుచానూరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులోని శ్రీనివాసస్వామివారితో పాటు అమ్మవార్లకు సోమవారం సుబ్రహ్మణ్యంరెడ్డి అనే దాత రూ.1.80 లక్షల విలువ చేసే వెండి కవచాలను వితరణగా అందజేశారు. టీటీడీ సూపరింటెండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ హరీష్ దాత సుబ్రహ్మణ్యంరెడ్డి కుటుంబసభ్యులతో కలిసి వీటిని అధికారులకు అందజేశారు.

జోరుగా టాస్క్‌ఫోర్స్ కూంబింగ్

ఎర్రావారిపాలెం, జనవరి 6(ఆంధ్రజ్యోతి) ; శేషాచలం అటవీ ప్రాంతంలో ఎర్రచందరం దొంగల కోసం టాస్క్‌ఫోర్స్ పోలీసులు జోరుగా కూంబింగ్ చేపట్టారు. సోమవారం మధ్యాహ్నం తలకోన అడవుల్లో గాలించారు. ఇటీవల భాకరాపేట, నెరబైలు,శ్రీవారి మెట్టు, తిరుమల ప్రాంతాల్లో దొంగలు స్మగ్లింగ్‌కు పాల్పడుతూ పటుబడ్డారు. ఈక్రమంలో స్మగ్లర్స్ శేషాచలం అడవులోనికి చొరబడ్డారనే సమాచారంతో తిరుమల,తలకోన, శేషాచలం అడవుల్లో జల్లెడ పట్టనున్నారు. పోలీసులు కూడా వేగం పెంచారు.

వేదోక్తంగా మృత్యుంజయ పూజలు

శ్రీకాళహస్తి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మృత్యుం జయ స్వామికి సోమవారం ఆగమోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా వినాయకస్వామికి పలు రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి కర్పూర హారతులు ఇచ్చారు. అనంతరం మృత్యుం జయ స్వామివారికి మొదట పాలు, పంచా మృతం, చందనం, విభూది, పచ్చ కర్పూరంతో వైభవంగా అభిషేకాలు నిర్వహించారు. వివిధ పుష్పాలతో, గజమాల, వెండి నాగాభరణంతో శోభాయ మానంగా అలంకరించారు. ధూప, దీప నైవేద్యాలు, మహామంగళ హారతులు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు.

సావిత్రిబాయి పూలే అవార్డుల ప్రదానం

తిరుపతి రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : యూత్ హాస్టల్‌లో వేఫౌండేషన్ ఆఫ్ ఇండియా, ఏపీ బీసీ ఉద్యోగుల సమాఖ్య జిల్లాశాఖ ఆధ్వర్యంలో సోమవారం సావిత్రిబాయి పూలే 194వ జయంతిని ఘనంగా నిర్వహించారు. వివిధరంగాల్లో సేవలందించే 50మంది మహిళలకు సావిత్రిబాయిపూలే ఎక్సలెన్సీ అవార్డులను ప్రదానం చేశారు. టీడీపీ జిల్లా పార్లమెంటరీ అధ్యక్షులు నరసింహయాదవ్ మాట్లాడుతూ దేశంలో మహిళా విద్యకు ముందడుగు వేసి స్ఫూర్తిప్రదాతగా నిలిచారని గుర్తు చేశారు. బహుజనుల మేధావులఫోరం కన్వీనర్, వెంకటనారాయణ మాట్లాడుతూ.. బాలికల విద్యాలయాలు, వర్సిటీలలో సావిత్రిబాయి పూలేవిగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్నారు. డాక్టర్ రమణప్రసాద్, డాక్టర్ శ్రీరాములు, పైడి అంకయ్య, టి.గోపాల్, భట్టా భాస్కర్‌యాదవ్, విజయప్రశాంతి, గణేష్‌బాబు పాల్గొన్నారు.

క్రీడా పరికరాల పంపిణీ

గూడూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి హాకీ పోటీలకు ఎంపికైన శ్రీచైతన్య పాఠశాలకు చెందిన విద్యార్థి గణేష్‌కు ప్రగతిసేవాసంస్థ ఆధ్వర్యంలో క్రీడా పరికరాలను అందజేశారు. సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ గణేష్ అండర్-14 జాతీయస్థాయి హాకీ పోటీలకు ఎంపిక కావడంతో హాకీస్టిక్, దుస్తులు, బూట్లు అందజేశామన్నారు.

చోరీలపై పోలీసుల స్పందన ఇలాగేనా?

తూతూ మంత్రంగా సందర్శన ●వేలిముద్రలు కూడా సేకరించరా...స్థానిక ప్రజలు ఆవేదన

తిరుచానూరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. పోలీసులకు సవాలు విసురుతున్నారు. రెండు వారాల క్రితం దామినేడులో ఓ వృద్ధురాలిని పాడిపేటలో హత్యచేసి నగలు దోచుకెళ్లారు. అంతకు మునుపు వేదాంతపురంలో ఉదయం వేళ మహిళను హత్య చేసి నగలు తీసుకుపోయారు. మూడు రోజుల క్రితం ముళ్లపూడి క్రాస్‌లో ధరణి లేఅవుట్‌లో మునితేజ ఇంటి తలుపు గడియ విరగొట్టి నగదు దోచుకువెళ్లారు. ఈలేఅవుట్‌లోని ప్రతి ఇంటికీ దొంగ తిరిగి టార్చిలైటు వేసి పరిశీలించి మరీ చోరీలకు పాల్పడినట్లు అక్కడివారు చెబుతున్నారు. సీసీ కెమెరాలు కూడా ఉండటం గమనార్హం. చోరీ జరిగాక మొక్కుబడిగా ఇద్దరు కానిస్టేబుళ్లు వచ్చారు. సీసీ కెమెరాలను పరిశీలించారు. ఓ సెక్యూరిటీ గార్డును పెట్టుకుంటే బాగుంటుందని సూచించి వెళ్లిపోయారు. ఎస్ఐ గానీ, క్లూస్‌టీం ఇప్పటికీ రాలేదు. నిందితుని వేలిముద్రలను సేకరించకపోవడాన్ని ఇక్కడి ప్రజలు తప్పుబడుతున్నారు. మరుసటి రోజు కూడా దొంగలు కాలనీకి వచ్చి టార్చిలైట్‌తో హల్‌చల్ చేశారు. చోరీ జరిగిన రోజున పోలీసులు వచ్చి దర్యాప్తు చేసి ఉంటే బాగుండేదని స్థానికులు అంటున్నారు. వందకు పైగా ఫోన్‌లు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా దామినేడులో ఏకంగా తలుపు పగులగొట్టి లోపలికి చొరబడ్డారు. యజమాని లేకపోవడంతో చోరీ సొత్తు వివరాలు తెలియలేదు. పేరుకు ముగ్గురు ఎస్ఐలు, మొబైల్‌వాహనం ఉన్నా నగర శివారు ప్రాంతాల్లో గస్తీని గాలికి వదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో రక్షక్ వాహన సిబ్బంది తీరుపై విమర్శలు వినిపిస్తున్నాయి. మద్యం బాబుల నుంచి డబ్బులు దండుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.


దామినేడులో తాళం భాగం వద్ద ఇంటి తలుపు పగులగొట్టిన దొంగలు

భక్తుల ఆరోగ్య భద్రతే టీటీడీ ప్రథమ లక్ష్యం

● అదనపు ఈవో వెంకయ్య చౌదరి


హోటళ్ల యజమానుల సమావేశంలో వెంకయ్య చౌదరి

తిరుమల, జనవరి6(ఆంధ్రజ్యోతి): భక్తుల ఆరోగ్య భద్రతకు భరోసా కల్పించడం టీటీడీ ప్రథమలక్ష్యమని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి అన్నారు. తిరుమల ఆస్థానమండపంలో సోమవారం హోటళ్ల యజమానులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..హోటళ్లు, తినుబండార కేంద్రాలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు భక్తుల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. తిరుబండారాల ఆవరణలో పరిశుభ్రత పాటించాలన్నారు. నిబంధనలు, మార్గదర్శకాలను పాటించాలన్నారు. పొడి, తడి చెత్తలను వేర్వేరు డస్ట్‌బిన్‌లో వేయడం, ముడి సరుకుల నిల్వ గది ఏర్పాటు చేయడం, పెస్ట్ కంట్రోల్ మెషీన్‌లను ఉంచడం, వంటివి తప్పకుండా పాటించాలన్నారు. ఇక నుంచి కన్సల్టెంట్ క్రమం తప్పకుండా తనిఖీలు చేస్తారని తెలిపారు. . సమావేశంలో ఎస్టేట్ అధికారి వెంకటేశ్వర్లు, డిప్యూటీ ఈవో ఆశాజ్యోతి, హెల్త్ ఆఫీసర్ మధుసూదన్, వీఎస్వోలు సురేంద్ర, రామ్‌కుమార్, హోటళ్ల యజమానులు, ప్రతినిధులు పాల్గొన్నారు. కాగా రాత్రి అదనపు ఈవో దుకాణాలను పరిశీలించారు.వస్తువుల ధరలపై ఆరా తీశారు. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌కు వెళ్లి కంపార్టుమెంట్లలో భక్తుల్న సౌకర్యాల గురించి తెలుసుకున్నారు.

'టీడీపీ నాయకుల్లో స్పర్ధలకు చెవిరెడ్డి కుట్ర'


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

చంద్రగిరి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సోషల్ మీడియా వేదికగా తనపై దుష్ప్రచారం చేస్తున్నారని టీడీపీ సీనియర్ నాయకుడు కుమారరాజారెడ్డి మండిపడ్డారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం కార్యక్రమంలో ఎమ్మెల్యే పులివర్తి నాని టీడీపీ కార్యకర్తలను పట్టించుకోవడం లేదని తాను ప్రస్తావించినట్లు వారి అనుకూలమైన మీడియాలో కథనాన్ని ప్రచురింపజేయడం దారుణమన్నారు. దాన్ని సోషల్ మీడియాలో ట్రోల్ చేయడం దుర్మార్గమన్నారు. కువైట్‌లో ఉన్న చెవిరెడ్డి ఇక్కడి టీడీపీ నేతల మధ్య మనస్పర్థలు సృష్టించేందుకు కుట్ర పన్నుతున్నారన్నారు. అవాస్తవాలు ప్రచారం చేస్తే ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. రూరల్ మండల టీడీపీ అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుల రాజకీయాలతో తమను నానికి దూరం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గౌస్‌బాషా, సోము, రఘునాథరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, హరి పాల్గొన్నారు.

నెల్లూరు జిల్లాలో గూడూరును విలీనం చేయండి


ఏవో శిరీషాకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గూడూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో విలీనం చేసేలా ప్రభుత్వం త్వరితగతిన చర్యలు తీసుకోవాలని అఖిలపక్ష నాయకులు కోరారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో కార్యాలయ ఏవో శిరీషాకు వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం గూడూరు నియోజకవర్గాన్ని తిరుపతి జిల్లాలో కలిపిందన్నారు. జిల్లా కేంద్రమైన తిరుపతికి వెళ్లాలంటే దూరం కావడంతో ప్రజలు, ఉద్యోగులు వ్యయ ప్రయాసలు పడాల్సివస్తుందన్నారు. ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందని, ఇప్పటికే ఈ విషయాన్ని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు.

తిరుచ్చిపై సుందరరాజస్వామి అభయం



తిరుచానూరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని సుందరరాజస్వామికి సోమవారం రాత్రి వేడుకగా తిరుచ్చి ఉత్సవం జరిగింది. జన్మనక్షత్రం ఉత్తరాభాద్ర పురస్కరించుకుని అర్చకులు విశేషంగా పూజాదికార్యక్రామలు నిర్వహించారు. ఉత్సవర్లకు అభిషేకం జరిగింది. సాయంత్రం సర్వ అలంకార శోభితులైన శ్రీదేవి, భూదేవిసమేత స్వామివారు బంగారు తిరుచ్చిపై మాడవీధుల్లో ఊరేగారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, భాస్కర్‌నాయుడు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 6(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియల్ పరీక్షలు రాసే విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టి మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యేలా ప్రిన్సిపాళ్లు చర్యలు చేపట్టాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి విశ్వనాథ్‌నాయక్ ఆదేశించారు. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు కళాశాలల ప్రిన్సిపాళ్లతో త్రైమాసిక, అర్ధ వార్షిక పరీక్షల్లో విద్యార్థులు సాధించిన మార్కులపై సోమవారం ఆయన సమీక్ష నిర్వహించారు. 50 శాతంమార్కులంటే తక్కువ వచ్చిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టి మంచి మార్కులు సాధించేలా చూడాలన్నారు. 2025లో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా చూడాలన్నారు.

10న వైకుంఠ ద్వార దర్శనం

ఐరాల(కాణిపాకం), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న వరదరాజస్వామి ఆలయంలో ఈనెల 10వ తేదీన వైకుంఠ ద్వార దర్శనం ఏర్పాటు చేస్తున్నట్లు ఈవో పెంచలకిషోర్ సోమవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు వరదరాజస్వామికి గ్రామోత్సవాన్ని హిస్తామన్నారు. భక్తులు విచ్చేసి స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

అంతర కళాశాలల క్రీడా,సాంస్కృతిక పోటీల ప్రారంభం



వాలీబాల్‌లో తలపడుతున్న క్రీడాకారులు- జ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభిస్తున్న వెటర్నరీ వర్సిటీ ఇన్‌చార్జి వీసీ డాక్టర్ జేవీరమణ

తిరుపతిరూరల్, జనవరి6(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ వర్సిటీ వేదికగా అంతర కళాశాలల క్రీడా, సాంస్కృతిక, సాహిత్య పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. వర్సిటీ డీన్ డాక్టర్ కె.వీరబ్రహ్మయ్య, అసోసియేట్ డీన్ డాక్టర్ పి.జగపతిరామయ్యలతో కలసి వెటర్నరీ వర్సిటీ ఇన్‌చార్జి వీసీ డాక్టర్ జేవీరమణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలు ఉన్నా విద్యార్థులందరూ భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందన్నారు. డీన్ డాక్టర్ కె.వీరబ్రహ్మయ్య మాట్లాడుతూ..అకడమిక్స్‌తోపాటు ఎక్స్‌ట్రా కరిక్యులర్ కార్యక్రమాల్లో ప్రతిభచాటిన విద్యార్థులకు వర్సిటీ తరపున బంగారుపతకం అందిస్తామన్నారు. వచ్చేనెలలో స్కిల్‌డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ప్రారంభిస్తున్నామని చెప్పారు. డాక్టర్ .జగపతిరామయ్య, ఓఎస్‌ఏ ప్రొఫెసర్‌డాక్టర్ వేణు, డాక్టర్ జయచంద్ర, ప్రొఫెసర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సందేశాలు.. ఉద్బోధాలు!

కుప్పం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు తన పర్యటనలో కొన్ని సందేశాలు, ఇంకొన్ని ఉద్బోధాలు చేశారు. జీవితమంటే జాక్‌పాట్ కాదన్న ఆయన, అందరూ కలసి వస్తేనే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని ఉద్బోధించారు. కుప్పంలో తొలిరోజు పర్యటన సందర్భంగా విద్యార్థులు, మేధావులతో ముఖాముఖిగానే కాకుండా, సోలరైజేషన్ కార్యక్రమం ప్రారంభం, ప్రకృతి వ్యవసాయ రైతులతో ముఖాముఖిలో కొన్ని సందర్భాలలో చంద్రబాబు చేసిన వ్యాఖ్యలివి.

● జీవితం ఎవరికీ జాక్‌పాట్ కాదు. కష్టపడితేనే ఏదైనా లభ్యమవుతుంది. నేను కూడా కిలోమీటర్ల దూరం నడిచివెళ్లి చదువుకున్నా. విద్యార్థి నాయకుడిగా, ఎమ్మెల్యేగా, చివరికి ముఖ్యమంత్రిగా ఈ స్థానంలో ఉన్నానంటే దానికి కృషి తోడైతేనే సాధ్యమైంది. మీరు కూడా కష్టపడాలి. కష్టపడితేనే ఫలితం ఉంటుంది.

● అది చెయ్యి, ఇది చెయ్యి అని నాకు మీరు డైరెక్షన్ ఇస్తారు. మీరు మాత్రం ఇంట్లో పడుకుంటారు. మీరు కూడా బాధ్యత తీసుకోవాలి. లైబ్రరీ ఏర్పాటుకు మీరు మీవంతు సహాయపడాలి. అన్నీ నేనే చేయాలంటే సాధ్యం కాదు. అందరూ కలసి సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి జరుగుతుంది. సామాజిక బాధ్యతతో వ్యవహరించాలి.

● ఐఐటీ కుప్పంలో రాకపోవచ్చు. లేనిపోని ఆశలు పెట్టుకోవద్దు. కుప్పాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతా. నాలెడ్జ్ సెంటర్ చేస్తా. అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను అందుకోసం వినియోగించుకుంటా.

● ఢిల్లీనుంచి సైబర్ సెక్యూరిటీస్ ప్రతినిధులుగా మీరు వచ్చారు. నేను అనుమతిస్తే 100 ఐటీ కంపెనీలు రాష్ట్రానికి తీసుకు వస్తామంటున్నారు. వెయ్యి కోట్ల పెట్టుబడులు తెస్తామంటున్నారు. చాలా సంతోషం. అయితే ఐటీ తెచ్చింది తొలుత నేను. దాన్ని ఉపయోగించుకుని మీరంతా ముందుకు పోయారు. అంటే నాకు గురుదక్షిణ ఇవ్వాలి మీరు. సహాయం చేయండి, నేను అందుకు ప్రభుత్వం తరఫున ఏం కావాలో అది చేస్తా.


నడిమూరులో ఏర్పాటు చేసిన సోలార్ ప్యానెల్‌ను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు, సీఎస్ విజయానంద్

● మా చిన్నప్పుడు కరెంటు సరిగా ఉండేది కాదు. లాంతర్ల వెలుగులో చదువుకున్నాం. కరెంటు ఎక్కడో చాలీచాలకుండా ఉత్పత్తి అయ్యేది. అది సరఫరా అయినప్పుడు వాడుకునేవాళ్లం. కరెంటు పోతే తిట్టుకునేవాళ్లం. కానీ ఇప్పుడు ఇంటిపైనే కరెంటు ఉత్పత్తి చేసుకునే స్థితికి వచ్చాం. నడిమూరులో ప్రారంభిస్తున్న పీఎం సూర్యఘర్ పథకంతో ప్రతి ఇంటి పైకప్పు కూడా సోలార్ విద్యుత్తు ఉత్పిత్తి చేస్తుంది. సోలార్ ప్యానెల్స్ ద్వారా ఇది సాధ్యమవుతుంది.

● వాతావరణ కాలుష్యం వల్లే మన జీవిత కాలం తగ్గిపోతోంది. కాలుష్యం లేకపోతే వందేళ్లు జీవించవచ్చు. మన ఇంట్లోని చెత్తను మనమే రోడ్లమీద వేస్తున్నాం. మురుగు కాలువలను రోడ్లమీదకు వదిలేస్తున్నాం. ఇదంతా కాలుష్యానికి కారణమవుతోంది. ఇంటినుంచే కాలుష్య రహిత సమాజం ప్రారంభం కావాలి. మొక్కలను పెంచి కాలుష్యాన్ని పారదోలాలి.



కుప్పం పర్యటన నిమిత్తం వచ్చిన సీఎం చంద్రబాబును మర్యాద పూర్వకంగా కలిసిన తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు

అవిలాల చెరువును అభివృద్ధి చేయండి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనలకు లోబడి అవిలాల చెరువు అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని అధికార యంత్రాంగాన్ని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. అవిలాల చెరువును ఎన్జీటీ నిబంధనలకు లోబడి అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. చెరువు అభివృద్ధిపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అధికారులు వివరించారు. సమావేశంలో తుడా సెక్రటరి వెంకటనారాయణ, ఎస్ఈ కృష్ణారెడ్డి అధికారులు పాల్గొన్నారు.

సకాలంలో ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు



మాట్లాడుతున్న సురేంద్ర నాయుడు

తిరుపతి(ఆటోనగర్), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌ఫార్మర్లు సకాలంలో మరమ్మతు చేసి సంస్థ అభివృద్ధికి సహకరించాలని తిరుపతి జిల్లా విద్యుత్ ఎస్ఈ పి.సురేంద్రనాయుడు అన్నారు. తిరుపతి సర్కిల్ కార్యాలయంలో సోమవారం ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కాంట్రాక్టర్లతో ఆయన సమావేశమయ్యారు. వినియోగదారులకు, రైతులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా ట్రాన్స్‌ఫార్మర్లను బాగుచేయాలని సూచించారు. సమావేశంలో ఈఈలు వాసవీలత(టెక్నికల్), ఇ.రవికుమార్ పాల్గొన్నారు.

మునిరత్నం సేవలు మార్గదర్శకం

- రాస్ ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం నాయుడు



మునిరత్నం విగ్రహం వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న నిర్వాహకులు

తిరుపతి(ఆటోనగర్), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ సేవా సమితి(రాస్) వ్యవస్థాపకుడు పద్మశ్రీ డాక్టర్ గుత్తా మునిరత్నం సామాజిక సేవలు తమకు మార్గదర్శకాలని, ఆయన ఆశయాలను కొనసాగిస్తామని రాస్ ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటరత్నం నాయుడు పేర్కొన్నారు. రాస్ సేవా నిలయంలో సోమవారం మునిరత్నం 89వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. పేదలకు, రైతులకు, మహిళాభ్యునతికి ఆయన చేసిన కృషిని కొనియాడారు. అనంతరం దివ్యాంగులకు వీల్‌చైర్స్, లాంగ్ హ్యాండ్ స్టిక్స్ అందించారు. 500 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో రాస్ సంయుక్త కార్యదర్శి మమత, డైరెక్టర్ వి.నాగరాజు, యువరాజు, మోహన్, ప్రసాద్, నందిని, మహిళా వికాస్ అధ్యక్షురాలు సమత పాల్గొన్నారు.

వ్యక్తిత్వ నిర్మాణమే ప్రగతికి సోపానం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అంకుర్‌జాన్‌వాలా

తిరుపతి అర్బన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిత్వ నిర్మాణమే ప్రగతికి సోపానమని జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ జాతీయ అధ్యక్షుడు అంకుర్ జాన్‌వాలా తెలిపారు. సోమవారం ఓ ప్రైవేటు హోటల్లో రెండు తెలుగు రాష్ట్రాల జేసీఐ అధ్యక్షుల శిక్షణ శిబిరాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. చదువుతో పాటు సామర్థ్యాలు, నైపుణ్యాలు పెంచుకోవాలన్నారు. జాతీయ ఉపాధ్యక్షుడు సుమిత్‌గోయల్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో తిరుపతి జోన్ జేసీఐ అధ్యక్షుడు శేషసాయి, మూడు జోన్‌ల అధ్యక్షులు సంతోష్, చతుర్వేది, భరత్, జాతీయ నేతలు జేఎల్ మనోహర్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నగర సంకీర్తనకు ఏడాది

- ఘనంగా తొలి వార్షికోత్సవం



నగర సంకీర్తనలో పాల్గొన్న భజన కళాకారులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రతి శనివారమూ భక్తి శ్రద్ధలతో చేపడుతున్న నగర సంకీర్తన కార్యక్రమం ఏడాది పూర్తి చేసుకుంది. రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో ప్రతి శనివారమూ సూర్యోదయానికి ముందే గోవింద నామస్మరణతో నగర వాసులను భజన కళాకారులు మేల్కొలుపుతున్నారు. నగర సంకీర్తన కార్యక్రమం విజయవంతంగా తొలి వార్షికోత్సవం నిర్వహించుకున్నట్లు రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి పేర్కొన్నారు. వందలాది మంది ప్రజలు స్వచ్ఛందంగా ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నట్లు చెప్పారు. నగర సంకీర్తన కార్యక్రమం తిరుపతి ఆధ్యాత్మిక శోభను పెంచే విధంగా ఉందని డాలర్స్ గ్రూప్ అధినేత దివాకర్‌రెడ్డి తెలిపారు. వాసుదేవరెడ్డి, మునినాథరెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, మునిరత్నం ఆచారి, వాసు, వెంకటాద్రి, జేజిరెడ్డి, సుబ్రమణ్యం, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 39 వినతులు

తిరుపతి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 39 వినతులు వచ్చాయని కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. టౌన్‌క్లబ్ పక్కన రోడ్డు వెడల్పు కోసం తీసుకున్న స్థలానికి టీడీఆర్ బాండ్లు ఇవ్వాలని డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ కోరారు. తాము కొర్లగుంట మారుతీనగర్‌లో నివాసముంటున్నామని, రికార్డుల్లో ముత్యాలరెడ్డిపల్లి న్యూ మారుతీనగర్‌గా నమోదైందని, మార్పు చేయాలని కోరారు. టీడీఆర్ బాండ్లు ఇప్పించాలని, రాజీవ్ గృహకల్ప కింద ఇంటికోసం డబ్బులు కట్టామని ఇల్లు రాలేదని, నగదు వెనక్కు ఇవ్వాలని కోరారు. తాను మాజీ సైనికుడిని ఇల్లు ఇప్పించాలని కోరారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ హైస్కూల్‌ను జూనియర్ కాలేజీగా అప్‌గ్రేడ్ చేయాలని, శెట్టిపల్లి పట్టాదారులకు రెండ్లు సెంట్లు స్థలం ఇవ్వాలని, పోస్టల్ కాలనీలో చెట్లు తొలగించాలని, సీసీ రోడ్లు వేయాలని కోరారు. ఏడీసీ చరణ్‌తేజ్ రెడ్డి, ఎస్ఈ శ్యాంసుందర్, ఎంఈలు తులసికుమార్, గోమతి, ఎంహెచ్‌వో యువ అన్వేష్, ఆర్వోలు సేతుమాధవ్, రవి, వెటర్నరీ ఆఫీసర్ నాగేంద్ర, మేనేజర్ హసీమ్ పాల్గొన్నారు.

తిరుపతి

లోగో ఆవిష్కరణ



లోగో ఆవిష్కరిస్తున్న వీసీ అప్పారావు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఈనెల 23న చేపట్టే సామూహిక సూర్య నమస్కారం లోగోను ఎస్వీయూ వీసీ అప్పారావు ఆవిష్కరించారు. నేతాజీ జయంతి సందర్భంగా ఎస్వీయూ - వివేకానంద కేంద్ర కన్యాకుమారి సంయుక్తంగా పదివేల మందితో ఎస్వీయూ గ్రౌండ్‌లో దీన్ని నిర్వహిస్తారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ భూపతినాయుడు, నిర్వాహకులు చెరుకూరి వెంకటేశ్వరప్రసాద్, రవినాయుడు, నాదమునిరెడ్డి, గంగాధర్, సురేంద్ర, రవినాయుడు, సుమన, వివేక్ పాల్గొన్నారు.

బార్లు, మద్యం దుకాణాల్లో ఎక్సైజ్ అధికారుల తనిఖీలు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బార్లు, మద్యం దుకాణాల్లో సోమవారం ఎక్సైజ్ అధికారులు తనిఖీలు చేపట్టారు. అర్బన్ ఎక్సైజ్ సీఐ రామచంద్ర ఆధ్వర్యంలో ఎస్ఐలు, సిబ్బంది టీములుగా విడిపోయి తనిఖీలు చేశారు. స్టాకు, సేల్స్ రిజిస్టర్లు పరిశీలించారు. ఎమ్మార్పీ అమలు, బాల కార్మికులు ఎవరైనా పనిచేస్తున్నారా అనే విషయాల గురించి ఆరా తీశారు. ఫిర్యాదులు అందితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

చెత్త సేకరణ పక్కాగా చేయాలి

తిరుపతి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నగరంలో వ్యాపార సముదాయాలు, అపార్ట్‌మెంట్ల నుంచి చెత్తను వేర్వేరుగా సేకరించాలని, ప్రజలకు ఆహ్లాదాన్ని అందించే పార్కులను శుభ్రంగా ఉంచాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. నగరంలో అభివృద్ధి పనులు, ఇంటింటి చెత్త సేకరణ, పన్నుల వసూళ్ల, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక వినతుల పరిష్కారం తదితర అంశాలపై అధికారులతో సోమవారం ఆమె సమావేశమయ్యారు. ఇంటింటి చెత్త సేకరణ లాగానే అన్ని హోటల్స్, వ్యాపార సముదాయాల వద్ద వేర్వేరుగా చెత్త సేకరణ చేయాలన్నారు. పార్కులను శుభ్రంగా ఉంచాలని అన్నారు. పార్కులు, స్కూల్స్‌లో మరుగుదొడ్లు లేవని ఫిర్యాదులు వస్తున్నాయని, అంచనాలు సిద్ధం చేస్తే చర్యలు తీసుకుంటామని అన్నారు. పన్నులను సకాలంలో వసూలు చేయాలని అన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన వినతులు సకాలంలో పరిష్కరించాలన్నారు.

డాక్టరేట్ ప్రదానం



స్వప్న

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ కామర్స్ పరిశోధకురాలు పర్వారు స్వప్న డాక్టరేట్ పొందారు. మార్కెటింగ్ స్ట్రాటజీస్ ఆన్ 7పిఎస్ ఆఫ్ షాపింగ్ మాల్స్ ఇన్ ఇండియా-ఎ స్టడీ విత్ రెఫరెన్స్ టు బెంగళూరు సిటీ అంశంపై ప్రొఫెసర్ రాజశేఖర్ పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసినట్లు సీఈ దామ్లానాయక్ తెలిపారు.

లైంగిక వేధింపులను కట్టడి చేయాలి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): లైంగిక వేధింపులను కట్టడి చేయాల్సిన అవసరముందని న్యాయవాది అపర్ణాదేవి పేర్కొన్నారు. పద్మావతి డిగ్రీ కాలేజీలో సోమవారం నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. లైంగిక వేధింపులకు గురికాకుండా విద్యార్థినులు జాగ్రత్తగా ఉండాలన్నారు. లైంగిక వేధింపులకు పాల్పడిన వారు కఠిన శిక్షలకు గురికావాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భద్రమణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రోత్సాహానికే ప్రతిభా అవార్డులు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఏపీ స్టూడెంట్స్ జేఏసీ సభ్యులు

తిరుపతి(లీలామహల్), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను గుర్తించి, వారిని ప్రోత్సహించడానికే ప్రతిభా అవార్డులు అందజేస్తున్నట్లు ఏపీ స్టూడెంట్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు హేమాద్రి యాదవ్ తెలిపారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన ఏపీ స్టూడెంట్స్ జేఏసీ ప్రతిభా అవార్డుల పోస్టర్లను ఆవిష్కరించారు. బుధవారం ఉదయం 10 గంటలకు ఎస్వీయూలోని శ్రీనివాస ఆడిటోరియంలో ప్రతిభావంతులైన విద్యార్థులను సత్కరించి మెమెంటో, ప్రశంసాపత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇంటర్ నుంచి పై చదువుల విద్యార్థులు హాజరుకావాలని కోరారు.

11న విద్యుత్ బీసీ ఉద్యోగుల రాష్ట్ర మహాసభలు



మహాసభల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

తిరుపతి(ఆటోనగర్), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఈనెల 11న విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నామని ఆ సంఘం డిస్కం కార్యదర్శి ఎల్.చలపతి తెలిపారు. సోమవారం తిరుపతి సదరన్ డిస్కం కార్యాలయ ప్రాంగణంలోని జ్యోతిరావుపూలే విగ్రహం వద్ద మహాసభల పోస్టర్లు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న బీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై మహాసభల్లో చర్చించనున్నట్లు తెలిపారు. సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జీకే వీరభద్రయ్య, బీ శ్రీధర్, ఎల్.చలపతి, రంగనాథం, కరీముల్లాఖాన్, జగదీష్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

28 నుంచి వైఖానస పంచరాత్ర శైవాగమాలపై వర్క్‌షాప్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఈనెల 28వ తేదీ నుంచి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో వైఖానస పంచరాత్ర శైవాగమాలపై వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. రెండు రోజుల పాటు ఈ అర్చక శిక్షణ నిర్వహిస్తారు. ఒక్కో ఆగమానికి చెందిన 20 మంది అర్చకులు శిక్షణలో పాల్గొంటారు. దక్షిణాది రాష్ట్రాలకు చెందిన ఎంపిక చేసిన అర్చకులకు అర్చన, సంకల్పం, ఉచ్చారణ, జ్యోతిష్యం, ఆగమం, మంత్ర పఠనం, యోగా అంశాలపై శిక్షణ ఇస్తారని వర్క్‌షాప్ కన్వీనర్ ప్రొఫెసర్ వేదాంతం విష్ణుభట్టాచార్యులు తెలిపారు.



పరసాలవీధిలో ముక్కు మూసుకుని రాకపోకలు సాగిస్తున్న స్థానికులు



మున్సిపల్ కార్పొరేషన్ మార్కెట్-2 ఎదురుగా చెత్త దిబ్బల మధ్య జన సంచారం

మురికికూపంగా స్మార్ట్ సిటీ

తిరుపతి(లీలామహల్), జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి నగరం పేరుకు మాత్రమే స్మార్ట్ సిటీగా ఉంది. వాస్తవానికి ఎటుచూసినా చెత్త కుప్పలు కనిపిస్తూ మురికికూపాన్ని తలపిస్తోంది. ఐస్‌మహల్ సమీపంలోని పరసాలవీధిలో జనవాసాల మధ్య రోడ్లపై చెత్తదిబ్బలు నిండిపోయాయి. స్థానికులు, వాహనదారులు ముక్కుమూసుకుని వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. చెత్త తీసి నాలుగు రోజులైందని స్థానికులు చెబుతున్నారు. రామచంద్ర పుష్కరిణి సమీపంలోని మున్సిపల్ కార్పొరేషన్ మార్కెట్-2 ఎదురుగా చెత్త నిల్వతో దుర్వాసన వస్తోంది. తొలగించాలని పట్నూలువీధి వాసులు కోరుతున్నారు.

పార్టీ బలోపేతమే లక్ష్యం

- జన సైనికులకు ఎమ్మెల్యే ఆరణి దిశానిర్దేశం



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న హరిప్రసాద్, కిరణ్‌రాయల్, రాజారెడ్డి తదితరులు

తిరుపతి అర్బన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు జన సైనికులకు దిశానిర్దేశం చేశారు. సోమవారం మధ్యాహ్నం ఓ హోటల్లో జనసేన డివిజన్ కమిటీ ప్రతినిధులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలో ప్రతి డివిజన్‌లోనూ నూతన కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. డివిజన్ల వారీగా ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తామని చెప్పారు. వచ్చే ఏడాది జరగనున్న కార్పొరేషన్ ఎన్నికలపై దృష్టి పెట్టి, గెలుపే ధ్యేయంగా ముందుకెళ్లాలని కోరారు. గత ఎన్నికల్లో వైసీపీ అప్రజాస్వామికంగా వ్యవహరించి, ఏకగ్రీవం చేసుకుందని ఆరోపించారు. గత ప్రభుత్వంలో జన సైనికులపై పెట్టిన కేసుల వివరాలు తెలియజేస్తే న్యాయపరంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ నెల 12, 13, 14 తేదీల్లో పీఠాపురంలో జరిగే పార్టీ ప్లీనరీ సమావేశాలకు తిరుపతి నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యేను పార్టీ నాయకులు సన్మానించారు. సమావేశంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు డాక్టర్.పి.హరిప్రసాద్, నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ కిరణరాయల్, నగరాధ్యక్షుడు రాజారెడ్డి, వెంకటేశ్వర్లు, ఆరణి శివ, ఆరణి మదన్, సుభాషిణి, కీర్తన, ఆకుల వనజ, కార్పొరేటర్లు సీకే రేవతి, కల్పనయాదవ్, వి.నారాయణ పాల్గొన్నారు.

ఫ్లెక్సీలు, బోర్డులు ఏర్పాటు చేస్తే జరిమానా



అధికారులతో సమావేశమైన మున్సిపల్ కమిషనర్ మౌర్య

తిరుపతి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ముఖ్య కూడళ్లు, ఫుట్‌పాత్‌లపై నిబంధనలకు విరుద్ధంగా ఫ్లెక్సీలు, బోర్డులు ఏర్పాటు చేస్తే జరిమానా విధించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ఆదేశించారు. నగరపాలక ప్లానింగ్ అధికారులతో ఆమె సోమవారం సమావేశమయ్యారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో జనన, మరణాలకు, పండుగలకు, రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు, బోర్డులను ఏర్పాటు చేయడం వల్ల వాహన చోదకులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నా రన్నారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది పర్యవేక్షించి అలాంటి వాటిని తొలగించాలని కోరారు. అనుమతులు పొందిన హోర్డింగులపైన మాత్రమే ఏర్పాటు చేసుకోవాలన్నారు. అదేవిధంగా టీడీఆర్ బాండ్ల పంపిణీకి అన్ని డాక్యుమెంట్లను పరిశీలించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ఆర్డీ సంజీవ్ కుమరన్, సబ్ రిజిస్ట్రార్ నీరజ, డీసీపీ మహపాత్ర, తుడా సీపీఓ దేవికుమారి, ఏసీపీ బాలాజి తదితరులు పాల్గొన్నారు.

టీటీడీలో హైందవ శంఖారావం డిక్లరేషన్ అమలు చేయాలి

- బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి

తిరుపతి(జీవకోన), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): టీటీడీలో హైందవ శంఖారావం డిక్లరేషన్ అమలు చేయాలని బీజేపీ నేత నవీన్ కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విజయవాడలో జరిగిన హైందవ శంఖారావంలో మఠాధిపతులు, పీఠాధిపతులు గళం విప్పి హిందూ సనాతన ధర్మానికి జీవం పోశారని, ఇది శుభ పరిణామమని పేర్కొన్నారు. అందులో చేసిన తీర్మానాలను టీటీడీ నుంచే అమలుకు శ్రీకారం చుట్టాలని కోరారు. టీటీడీ ధర్మకర్తల మండలిలో ఏకవాక్య తీర్మానం ప్రభుత్వాలకు పంపించాలని కోరారు. హిందూ ఆలయాల భూముల సంరక్షణకు మఠాధిపతులు, పీఠాధిపతులతో కూడిన కమిటీ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు.

అభివృద్ధి పనులకు సహకరించండి

తిరుపతి(లీలామహల్), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): తిరుపతి మాస్టర్‌ప్లాన్‌లో భాగంగా ఆమోదం పొందిన అభివృద్ధి పనులను పూర్తి చేసేందుకు సహకరించాలని తిరుపతి కో-ఆపరేటివ్ టౌన్‌బ్యాంక్ వైస్ చైర్మన్ వాసుయాదవ్ కోరారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ తిరుమల బైపాస్ నుంచి సత్యనారాయణపురం సర్కిల్ మధ్యన వేసిన విరజామార్గం 40 అడుగుల రోడ్డు పనులు వంద మీటర్లు నిలిచిపోయాయని, రెండు రోజుల క్రితం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు రోడ్డు వేయడానికి వస్తే అన్నా రామచంద్ర యాదవ్ అడ్డుకున్నారని తెలిపారు. ఆ స్థలం పరిహార విషయమై కోర్టులో కేసు వేశారని పేర్కొన్నారు. రిజిస్టర్ కాని స్థలానికి టీడీఆర్ బాండ్లు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. రోడ్డు పూర్తిచేసి జీవకోన ప్రజల అభివృద్ధికి సహకరించాలని కోరారు. సమావేశంలో నవీన్, రమణ, కోటి, ప్రసాద్, స్వరూప్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రచందనం ఫర్నిచర్ విక్రయించుకునే అవకాశం కల్పించండి



సమావేశంలో టింబర్ డిపోల అసోసియేషన్ ప్రతినిధులు

మంగళం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఎర్రచందనం సాగు చేస్తున్న రైతుల నుంచి దుంగలు కొనుగోలు చేసి, హ్యాండీక్రాఫ్ట్, ఫర్నిచర్ తయారు చేసి విక్రయించుకునే అవకాశం కల్పించాలని టింబర్ డిపోల అసోసియేషన్ ప్రతినిధులు అటవీ శాఖ అధికారులను కోరారు. సోమవారం తిరుపతి బయోట్రిమ్ కార్యాలయంలో సీసీఎఫ్(కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్) సెల్వం, తిరుపతి జిల్లా అటవీ శాఖాధికారి వివేక్, స్టేట్ సెల్వీ కల్చరిస్ట్ నరేంథిరన్ ఆధ్వర్యంలో ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక పరిధిలోని టింబర్ డిపోల అసోసియేషన్ ప్రతినిధులు సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ ఎర్రచందనం హ్యాండీక్రాఫ్ట్ పరికరాలు, ఫర్నిచర్ తయారు చేసి విక్రయిస్తే రైతులను కూడా ప్రోత్సహించవచ్చునన్నారు. తిరుపతి, తిరుమలలోని ప్రధాన కూడళ్ల వద్ద అవుట్ లెట్లను ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పించాలని కోరారు. విదేశాల్లోనూ ఎర్రచందనం దుంగలను విక్రయించుకునేలా డీజీఎఫ్టీ (డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్) అనుమతులు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని అధికారులు హామీ ఇచ్చారు.

సమగ్ర విచారణ చేపట్టండి

- ఉన్నత విద్యామండలికి ఏఐఎస్ఎఫ్ వినతి



ప్రొఫెసర్ మధుమూర్తికి విన్నవిస్తున్న శివారెడ్డి తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలో స్క్రాప్ తరలింపుపై సమగ్ర విచారణ చేపట్టాలని ఉన్నత విద్యామండలి చైర్మన్ మధుమూర్తిని ఏఐఎస్ఎఫ్ నేతలు శివారెడ్డి, నాజర్ కోరారు. సోమవారం విజయవాడలో కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఎక్కువ విలువ చేసే స్క్రాప్‌ను తక్కువ ధరకు అప్పగించారని ఆరోపించారు. నచ్చిన వ్యక్తులకు స్క్రాప్‌ను కట్టబెట్టారని తెలిపారు. టెండర్లు నిర్వహించలేదన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలకు తావివ్వకుండా బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

తిరుపతిలో రౌడీల వీరంగం

- బీరు సీసాలతో దాడి
- ఒకరికి తీవ్ర గాయాలు

తిరుపతి(నేర విభాగం), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో నడిరోడ్డుపై సోమవారం రౌడీలు వీరంగం చేసారు. తోటి స్నేహితుడిపై మద్యం మత్తులో కర్రలు, రాళ్లతో దాడి చేశారు. ఈస్ట్ పోలీసు స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఈ ఘటన జరిగింది. ఈస్ట్ ఎస్ఐ బాలకృష్ణ తెలిపిన ప్రకారం.. తిరుపతి బండ్లవీధికి చెందిన సాయికుమార్ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఇతడి స్నేహితులు శీను, చందు, గణేష్, కుట్టి, ప్రభు, శివ కలిసి పాత కక్షల నేపథ్యంలో సోమవారం సాయికుమార్ ను ఒక పథకం ప్రకారం పిలిపించారు. వైన్ షాప్ వద్ద మద్యం తాగారు. ఆరుగురు కలిసి సాయికుమార్‌తో వాగ్వాదానికి దిగారు. వారి మధ్య మాటామాటా పెరిగి కొట్టుకునే దశకు చేరింది. ఆరుగురు కలసి బీరు సీసాలతో, కర్రలతో దాడి చేయడంతో సాయికుమార్‌కు తీవ్రగాయాలయ్యాయి. వీరి నుంచి తప్పించుకున్న ఆయన.. ఈస్ట్ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ బాలకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితులెవరికీ ఒక చిరునామా అంటూ లేదని, జులాయిగా తిరుగుతుంటారని పోలీసులు చెప్పారు.



గెలుపే లక్ష్యంగా..

తిరుపతిలోని ఎస్వీ వెటర్నరీ వేదికగా 13వ అంతర కళాశాలల క్రీడా, సాంస్కృతిక, సాహిత్య పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. కళాశాల క్రీడా మైదానంలో జరిగిన తొలిరోజు పోటీల్లో పలు కళాశాలల విద్యార్థులు ఉల్లాసంగా.. ఉత్సాహంగా పాల్గొన్నారు. వాలీబాల్ పురుషుల విభాగంలో ప్రొద్దుటూరు వెటర్నరీ కళాశాలపై తిరుపతి కళాశాల జట్టు.. గరివిడిపై ఎన్టీఆర్ గన్నవరం కళాశాల జట్టు విజయం సాధించాయి. మహిళా విభాగంలో గరివిడి వెటర్నరీజట్టుపై తిరుపతి కళాశాల విజయం సాధించింది. బాస్కెట్‌బాల్ మహిళల విభాగంలో గన్నవరంపై ప్రొద్దుటూరు కళాశాల, తిరుపతి డెయిరీ టెక్నాలజీ కాలేజీపై స్థానిక వెటర్నరీ కళాశాల జట్టు విజేతగా నిలిచాయి. టెన్నికాయిట్‌లో తిరుపతి డెయిరీ టెక్నాలజీ కాలేజీపై ప్రొద్దుటూరు వెటర్నరీ కళాశాల.. గరివిడి వెటర్నరీ, తిరుపతి డెయిరీ టెక్నాలజీ జట్లపై తిరుపతి వెటర్నరీ కాలేజీ విజేతగా నిలిచింది. బాల్‌బ్యాడ్మింటన్ మహిళల విభాగంలో ఎన్టీఆర్ వెటర్నరీపై గరివిడి వెటర్నరీ కళాశాల జట్టు గెలుపొందింది.



- తిరుపతిరూరల్, ఆంధ్రజ్యోతి

శ్రీవారి సర్వదర్శనానికి 10 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 15 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

బుధవారం నాటి హుండీ ఆదాయం : రూ.3.98 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 66,561

తలనీలాలు సమర్పించినవారు:18,647



ఒత్తిడిని చిత్తు చేద్దాం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సమస్యలు..వీటి నుంచి ఉత్పన్నమయ్యే ఒత్తిళ్లు.. ఈ రెండూ అందరికీ నిత్య జీవితంలో ఎదురవుతాయి. అందుకే ఒత్తిళ్లను అమ్మ పొత్తిళ్ల అనుకోవాలంటారు పెద్దలు.. బుర్ర నిండా బోలెడు సమస్యలు. తెల్లారిలేచింది రాత్రి పక్క చేరేదాకా ఒకటే ఒత్తిడి. కూల్‌గా ఉండలేని పరిస్థితి. పరుగులెత్తే ఆధునిక ప్రపంచంలో నిశ్చింతగా ఉండటం అంత ఈజీ కాదు. ఒక్కొక్కరిదీ ఒక్కో లక్ష్యం. చేరుకోలేక నిత్యం సతమతం. వ్యక్తిగత, కుటుంబ, సామాజిక, ఆర్థిక సమస్యలతో నిరంతరం కుస్తీ. పర్యవసానంగా ఇప్పుడున్న పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్నారు. ఇది మనసునే కాదు ఆరోగ్యాన్నీ ప్రభావితం చేస్తోంది. కుంగదీస్తోంది. సమస్యను సరిగా అర్థం చేసుకోలేకపోవడం, పరిష్కారాన్ని కనుక్కోలేకపోవడం వల్ల ఒత్తిడి మరింతగా పెరుగుతుందంటారు పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం సైకాలజీ విభాగం అధ్యాపకురాలు డాక్టర్ గాయత్రి.. ఏ సమస్యా శాశ్వతంగా స్థిర నివాసమేర్పచుకోదని గుర్తిస్తే ఒత్తిడి పటాపంచలవుతుందంటున్నారు..ఆమె ఇంకా ఏం చెబుతున్నారంటే..



డాక్టర్ గాయత్రి అధ్యాపకురాలు, సైకాలజీ విభాగం, పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం



ఈ జాగ్రత్తలు తీసుకుంటే మేలు

సాధ్యమైనంతవరకూ ప్రతికూల మనస్తత్వాన్ని దూరం చేసుకోవాలి. సానుకూల దృక్పథాన్ని అలవరుచుకుంటే ఒత్తిడికి నేరుగా చెక్ పెట్టవచ్చు. అయిన దానికీ కాని దానికీ బూతద్దంలో చూడటం మానుకోవాలి. ఏమాత్రం తీరిక దొరికినా ఆత్మీయులతో కొన్ని షేర్ చేసుకోవాలి. కొంత భారం దిగుతుంది. మానసిక ఉల్లాసాన్ని పెంచే అభిరుచులను అలవర్చుకోవాలి. సృజనాత్మకతగా ఆలోచించినా ఉపశమనం కలుగుతుంది. పండ్లు, కూరగాయలు ఆహారంగా తీసుకోవడం ఉత్తమం. క్రమం తప్పకుండా వేళకు తిని పడుకోవాలి. రోజూ వ్యాయామం, ధ్యానం, యోగా చేయడం శ్రేయస్కరం. లేకపోతే ఒత్తిడి, రోగాలు మన కోసం సమయం కేటాయిస్తాయని గుర్తించాలి. ప్రకృతితో మమేకం కావడం. మంచి పుస్తకాలు చదవడం లాంటివి అభిరుచిగా మారితే ఒత్తిడికి గట్టిగా సమాధానం చెప్పవచ్చు. హాస్య వినోదాన్ని ఆస్వాదించాలి. మొహమాటంతో అన్నింటికీ ఎస్ అనవద్దు. చేయలేని పనులకు నో చెప్పండి. సమస్య గురించి ఎక్కువగా ఆలోచించి బుర్ర పాడుచేసుకోవడం కంటే అందులో సగం సమయం పరిష్కారం గురించి ఆలోచిస్తే ఎంతో ప్రయోజనం. మొబైల్ ఫోన్లకు అతిగా సమయం కేటాయిస్తే నిద్రకు దూరమై మానసిక,శారీరక అనారోగ్యం బారినపడతారు. మానసిక ఒత్తిడి తగ్గితే శ్వాస ప్రక్రియ కూడా సాధారణ స్థితికి చేరుకుంటుంది. అంతేకాదు హార్మోన్లూ సమతుల్యమవుతాయి. ఇక భావోద్వేగాలు మీ అదుపులో ఉంటాయి.

ఒత్తిడిని గుర్తించడం ఇలా..

తీవ్ర ఒత్తిళ్లకు లోనైనప్పుడు కోపం, అసహనం, ప్రతీకారం,అభద్రత, నిరాశ, మనసులో గూడు కట్టుకుంటాయి. అపనమ్మకం పెరిగి ప్రతిదానికీ భయపడుతుంటారు. ఫలితంగా నిద్ర లేమి ఉత్పన్నమవుతుంది. దీంతో నీరసించిపోవడంతోపాటు భావోద్వేగాల నియంత్రణలో మార్పులు కనిపిస్తాయి. ఇవి బీపీ, షుగర్ వంటి సమస్యలకు కారణమవుతాయి. గుండెజబ్బులకూ దారితీస్తాయి. ఒత్తిడి దీర్ఘకాలంగా ఉంటే మతిమరుపు, డిప్రెషన్, అజీర్తి, అస్తమా, గుండెజబ్బులు రావచ్చు.

ముక్కంటి ఆలయంలో ముగ్గురు సెక్యూరిటీ సూపర్‌వైజర్ల తొలగింపు

● మరొకరిపై విచారణ

శ్రీకాళహస్తి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయం సెక్యూరిటీ విభాగంలో కొందరి తీరు అభ్యంతరకరంగా మారింది. కొంతకాలంగా విధి నిర్వహణలో వారు వ్యవహరిస్తున్న శైలిపై అధికారులు పలుమార్లు మందలించినా పద్ధతి మార్చుకోలేదు. ఫలితం.. ఒకేసారి ముగ్గురు సూపర్‌వైజర్లను విధుల నుంచి తప్పించారు. మరొకరిపై మహిళల ఫిర్యాదుతో అధికారులు గోప్యంగా విచారణ చేపట్టారు. శ్రీకాళహస్తి మండలం ఊరందూరుకు చెందిన శీనయ్య అనే సూపర్‌వైజరు మహిళా సిబ్బందితో దురుసుగా ప్రవర్తించడం, ఇష్టంవచ్చినట్టు గార్డులను నియమించుకోవడం.. ఇష్టం లేని వారికి విధులు కేటాయించకుండా వేధించడంలాంటి చేసేవాడన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో మూడు నెలల క్రితం ఆయన్ను కొంతకాలం విధుల నుంచి పక్కన పెట్టారు. మళ్లీ అధికారులను ప్రాధేయపడటంతో తిరిగి సూపర్‌వైజర్‌గా అవకాశం ఇచ్చారు. ఇక, శ్రీకాళహస్తి పట్టణానికి చెప్పిందిన శ్యామ్ ఆలయ రెండో గోపురం పక్కనే యూనిఫాంలో మద్యం తాగుతున్న ఫొటోలు, వీడియోలు రెండు నెలల క్రితం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. అధికారులు మందలించి క్రమశిక్షణతో పనిచేయాలని కొనసాగించారు. ఇటీవల సూపర్‌వైజర్లు ఒక ప్రామాణికం లేకుండా సెక్యూరిటీ గార్డులను నియమించుకోవడం, కొందరికి విధులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేసేవారు. ఆలయంలో భక్తుల నుంచి నగదు వసూలయ్యే కీలక స్థానాల్లో అనుకూలమైన వారిని నియమించుకోవడం ద్వారా ఆ నగదు వాటాలుగా పంచుకుంటున్నట్లు ఈవో బాపిరెడ్డికి ఫిర్యాదులు వచ్చాయి. దాంతో నాలుగు రోజుల పాటు విధులు కేటాయింపుపై ఈవో దృష్టి సారించారు. ప్రత్యేకంగా ఆదాయం వచ్చే చోట్ల కొందరు సూపర్‌వైజర్లకు విధులు కేటాయించి నిఘా పెట్టారు. వీరు అక్రమాలకు పాల్పడుతున్నట్లు సీసీకెమెరాల ద్వారా పక్కా ఆధారాలతో గుర్తించారు. దీంతో ఎప్పటి నుంచో విమర్శలున్న శీనయ్య, శ్యామ్‌తో పాటు చంద్రను విధుల నుంచి తప్పుకోవాల్సిందిగా ఆదేశించారు.

విధులివ్వకుండా వేధిస్తున్నారని..

శ్రీకాళహస్తి పట్టణం వాటర్‌హౌస్ కాలనీకి చెందిన సూపర్‌వైజర్ షణ్ముగంపై సోమవారం కొందరు మహిళా సెక్యూరిటీ గార్డులు ఫిర్యాదులు చేశారు. తొట్టంబేడు మండలం కన్నలి నుంచి ఓ మహిళ గార్డు విధుల కోసం మధ్యాహ్నం ఆలయం వద్దకు వచ్చారు. ఈమెకు కాకుండా, సీనియార్టీ ప్రకారం వెనుక ఉన్న మహిళకు షణ్ముగం డ్యూటీ కేటాయించారు. ఇలా నాలుగు రోజుల నుంచి డ్యూటీ ఇవ్వకుండా తిప్పి పంపుతున్నట్లు ఆమె నేరుగా ఓ అధికారికి ఫిర్యాదు చేశారు. దీనిపై రిజిస్టర్‌లో అధికారులు పరిశీలించి షణ్ముగంను మందలించారు. రెండు నెలల క్రితం సూపర్‌వైజరు షణ్ముగం ఓ మహిళా సెక్యూరిటీ గార్డును విధుల్లో ఉండగా అసభ్యంగా ప్రవర్తించినట్లు ఫిర్యాదులు వచ్చింది. కొద్దిరోజుల పాటు అతడిని విధుల నుంచి తొలగించినప్పటికీ.. మళ్లీ చేరాడు. కాగా, విధుల్లో ఉండగా వీడియోలు తీస్తూ వేధిస్తున్నారని కొందరు మహిళా సెక్యూరిటీ గార్డులు సోమవారం మళ్లీ ఫిర్యాదు చేశారు. దీంతో షణ్ముగం వ్యవహారంపై విచారించి చర్యలు తీసుకుంటామని ఈవో వెల్లడించారు.

విద్యుత్ శాఖ ప్రతిపాదనలపై నేటి నుంచి ప్రజాభిప్రాయ సేకరణ

తిరుపతి(ఆటోనగర్), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): 2025-26 ఆర్థిక సంవత్సరానికి వార్షిక ఆదాయ అవసరాలు, విద్యుత్ రిటైల్ ధరలపై ఏఆర్ఆర్, సప్లయ్ టారిఫ్ ప్రతిపాదనలపై మంగళ, బుధ, శుక్రవారాల్లో ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ ప్రారంభమవుతుందని తిరుపతి జిల్లా విద్యుత్ సర్కిల్ ఎస్ఈ పి.సురేంద్ర నాయుడు తెలిపారు. ఎస్ఈ కార్యాలయంలో తిరుపతి టౌన్, తిరుపతి రూరల్ డివిజన్ల ప్రజలు పాల్గొంటారని పేర్కొన్నారు. పుత్తూరు, నాయుడుపేట, గూడూరు డివిజన్ కేంద్రాల్లో వినియోగదారులు పాల్గొని అభిప్రాయాలు, అభ్యంతరాలు తెలపాలని కోరారు. పాల్గొనదలచిన వారు మంగళ, బుధవారాల్లో కూడా పేర్లు నమోదు చేసుకోవచ్చని చెప్పారు. అయితే నియంత్రణా మండలి చైర్మన్ అనుమతితో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. కాగా, సోమవారం ఎస్ఈ కార్యాలయంలో నిర్వహించిన మాక్ వీడియో కాన్ఫరెన్స్‌లో ఈఈలు వాసురెడ్డి, చంద్రశేఖరరావు, వాసవీలత పాల్గొన్నారు.

నేడు యూజీసీ కమిటీ రాక

ఎస్వీయూ దూరవిద్య నిర్వహణపై మూడు రోజుల పాటు అధ్యయనం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నేటి నుంచీ ఎస్వీయూలో యూజీసీ కమిటీ పర్యటించనుంది. వర్సిటీ దూరవిద్య విభాగ నిర్వహణపై మూడు రోజుల పాటు ఈ కమిటీ అధ్యయనం చేయనుంది. నలుగురితో కూడిన ఈ కమిటీ మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు సెనేట్ హాల్లో అధికారులు, అధ్యాపకులతో కమిటీ ప్రత్యేకంగా సమావేశం కానుంది. అనంతరం దూరవిద్య కోర్సులు గల సబ్జెక్టులు గల విభాగాలను కమిటీ పరిశీలించనుంది. విద్యార్థులతోనూ కమిటీ ముచ్చటించనుంది.

రాత్రి వేళల్లో గ్రావెల్ తరలింపు

● ఛిద్రమౌతున్న కొండగుట్ట





గ్రావెల్ తవ్వకాల వద్ద ఆరిమేనిపాడు గ్రామస్తుల నిరసన - గ్రావెల్ తవ్వకంతో ఏర్పడిన భారీ గోతులు

ఓజిలి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలంలో ఆరిమేనిపాడు నుంచి రాత్రి వేళల్లో గ్రావెల్ తరలింపు యథేచ్ఛగా సాగుతోందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సోమవారం గ్రామానికి చెందిన ముప్పాళ్ళ నరేష్‌రాజు, గుంటమడుగు రవీంద్రరాజు, మస్తాన్‌రాజు కట్టిబోయిన వెంకటేశ్వర్లు, మల్లికార్జున్‌రాజు, పట్టాభిరాజు, ఈశ్వర రాజు తదితరులు గ్రావెల్ తవ్వకాలతో ఏర్పడిన భారీ గోతుల వద్ద నిలబడి నిరసన తెలిపారు. వారి కథనం మేరకు వివరాలు... ఆరిమేనిపాడు సర్వే నెంబరు 65లో 260.72 ఎకరాలు కొండగుట్టగా రెవెన్యూ రికార్డుల్లో నమోదై ఉంది. ఇక్కడ నుంచి గ్రావెల్ తరలింపు కోసం 54 ఎకరాల లీజు కోసం ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ సంస్థ 15 జూన్ 2020న దరఖాస్తు చేసుకుంది. పర్యావరణ ప్రజా విచారణ పేరుతో 2022 అక్టోబరు 28న ఆరిమేనిపాడు గ్రామంలో అధికారులు సమావేశం నిర్వహించారు. గ్రామస్తులందరూ క్వారీ అనుమతులకు అభ్యంతరం తెలిపారు. కొన్నాళ్ల తరువాత గ్రామస్తుల కంటపడకుండా రాత్రుళ్లలో గ్రావెల్ తరలింపు జరుగుతుండడంతో ఆరిమేనిపాడు వాసులంతా ఏకమై అడ్డుకున్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక గత రెండు నెలలుగా క్వారీకి పూర్తి స్థాయి అనుమతులు ఉన్నాయంటూ గ్రావెల్ తరలింపునకు పూనుకున్నారు. గ్రామస్తులంతా ఏకమై అడ్డుకోవడంతో క్వారీ నిర్వాహకులు పోలీసులను ఆశ్రయించి కేసులు పెట్టేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో అధికారులను సంప్రదించి క్వారీ అనుమతులకు సంబంధించిన వివరాలు సేకరించగా భోగస్ పత్రాలతో 2022లో క్వారీ నిర్వాహణకు అనుమతి పొందినట్లు తేలిందన్నారు. క్వారీ అనుమతులకు తమ అభ్యంతరం లేదని కాండ్ర (చిల్లకూరు మండలం), వెందోడు (బాలాయపల్లి మండలం)గ్రామాల వారితో పాటు ఆరిమేనిపాడుకు చెందిన కొంతమంది అర్జీ ఇచ్చినట్లుగా పేర్కొన్నారని, ఇందుకోసం తమ గ్రామస్తుల సంతకాలను ఫోర్జరీ చేశారని ఆరిమేనిపాడువాసులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా గ్రామంలో లేని వ్యక్తుల పేర్లు కూడా ఉన్నాయని తెలిపారు. ఆ భోగస్ పత్రాలతో ఇచ్చిన అనుమతి కూడా 2024సెప్టెంబరుతో ముగిసిందన్నారు. పక్క మండలాల్లోని గ్రామాల్లో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టి, అక్కడి స్థానికులు సమ్మతించినట్లు చూపే పత్రాలతో తమ గ్రామంలో క్వారీ నిర్వహణకు ఎలా అనుమతి ఇస్తారని ఆరిమేనిపాడువాసులు ప్రశ్నిస్తున్నారు. పైగా గతేడాది సెప్టెంబరుతో ముగిసిన అనుమతి పత్రాలతో రాత్రి వేళ గ్రావెల్ తరలించడం అక్రమమేనని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

తిరుమలలో నేడు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుమల, జనవరి6(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో ఈనెల 10 నుంచి 19వ తేదీ వరకు వైకుంఠ ఏకాదశి ద్వార దర్శనాలు జరగనున్న క్రమంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం(ఆలయ శుద్ధి) చేపట్టనున్నారు. ఉదయం 6 నుంచి 10 గంటల వరకు ఆలయ శుద్ధిని అర్చకులు ఆగమోక్తంగా నిర్వహిస్తారు. ఆనందనిలయం మొదలుకొని బంగారు వాకిలి వరకు, శ్రీవారి ఆలయంలోపల ఉన్న ఉప ఆలయాలు, ఆలయ ప్రాంగణం, పోటు, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర వస్తువులను శుభ్రంగా కడుగుతారు. తర్వాత సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర జలాన్ని ఆలయమంతా ప్రోక్షణం చేస్తారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. మంగళవారం వీఐపీ బ్రేక్ దర్శనాలను టీటీడీ రద్దు చేసింది.



సురేఖవాణి, సుప్రిత

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. సినీనటి సురేఖవాణి, ఆమె కుమార్తె సుప్రిత, ఎమ్మెల్సీ అనంత ఉదయ్ భాస్కర్ ఉన్నారు.

పోలీసు పీజీఆర్ఎస్‌కు 69 వినతులు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 69 వినతులు వచ్చాయి. ఎస్పీ సుబ్బరాయుడు అర్జీదారుల సమస్యలు తెలుసుకున్నారు. కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. మరికొన్నింటిని పరిశీలించి, ఆయా స్టేషన్లకు పంపారు. నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని ఆదేశించారు. అదనపు ఎస్పీలు రవిమనోహరాచారి, నాగభూషణం పాల్గొన్నారు.



ప్రజల నుంచి వినతులు తీసుకుంటున్న ఎస్పీ సుబ్బరాయుడు

దామినేడులో దొంగల హల్‌చల్

● ఇంటి తలుపులు పగులగొట్టిన వైనం



చిందరవందరగా వస్తువులు

తిరుచానూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో వరుస దొంగతనాలు ఆందోళన కలిగిస్తున్నాయి. తాజాగా దామినేడులో మరో చోరీ జరిగింది. బాధితుని కథనం మేరకు కథనం దామినేడులో వెంకటేశ్వరరావు అనే వ్యక్తి ఇల్లు కట్టుకుని ఉంటున్నారు. వ్యాపారరీత్యా ఇతర ప్రాంతాలకు వెళ్లొస్తుంటారు. రెండు రోజుల క్రితం వెంకటేశ్వరరావు ఇంటిలో ఆయన సోదరి కుటుంబ సభ్యులు బస చేసి వెళ్లారు. సోమవారం ఉదయం పనిమనిషి ఇంటిని శుభ్రం చేయడానికి రాగా, ప్రధాన తలుపు తెరచి ఉంది. అనుమానించి ఇంటి యజమాని వెంకటేశ్వరరావుకు ఫోన్ చేసింది. ఆయన సూచనతో ఆమె తిరుచానూరు పోలీసులకు విషయం తెలియసేసింది. దుండగులు ఆదివారం రాత్రి ప్రధాన గేటు తాళాలు విరగొట్టారు. ప్రధాన ద్వారం ఆటోమేటిక్ లాక్ రాకపోవడంతో తలుపు విరగొట్టి లోపలకు వెళ్లారు. సీసీ కెమెరాను పగులగొట్టారు. వెంకటేశ్వరరావు సోమవారం రాత్రి హైదరాబాద్ నుంచి బయలుదేరారు. ఆయన వచ్చి చూస్తే చోరీ సొత్తు వివరాలు తెలుస్తాయి.

రెవెన్యూ సదస్సులకు 186 అర్జీలు

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం నిర్వహించిన 31 రెవెన్యూ సదస్సులకు 186అర్జీలు వచ్చినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. ఇప్పటి వరకు మొత్తం 16,097 అర్జీలు రాగా అందులో 709 పరిష్కరించామన్నారు. మిగిలిన వాటిని నిర్ణీత కాలపరిమితిలోపు అధికారులు పరిష్కరిస్తారన్నారు.

సమస్యలను పట్టించుకోండి మహాప్రభో..!



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్లు

కలెక్టరేట్‌కు క్యూకట్టిన అర్జీదారులు - పీజీఆర్ఎస్‌కు 214 అర్జీలు

తిరుపతి(కలెక్టరేట్),జనవరి 6(ఆంధ్రజ్యోతి): 'మా సమస్యలను పరిష్కరించండి మహాప్రభో' అంటూ అర్జీదారులు అధికారులకు మొరపెట్టుకున్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు అర్జీదారులు పెద్దయెత్తున హాజరై కలెక్టర్ వెంకటేశ్వర్, ఇతర అధికారులకు తమ సమస్యలను విన్నవించారు. మొత్తం 214 అర్జీలు అందగా అందులో రెవెన్యూ శాఖకు 148 ఉన్నాయి. జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, ఇతర అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న గెరికినెట్టు గ్రామస్తులు

గ్రామానికి దారి చూపండి

తమ గ్రామానికి దారి చూపాలని పాకాల మండలం గెరికినెట్టు వాసులు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. దారి ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్‌కు విన్నవించారు. గానుగపెంట-మొగరాల రోడ్డు నుంచి తమ గ్రామానికి వచ్చే దారిని కొంతమంది అక్రమంగా మూసేశారని తెలిపారు. ఆ దారిలో నడవకూడదని దౌర్జన్యం చేస్తున్నట్లు చెప్పారు. రెండు నెలలుగా ఇబ్బంది పడుతున్నామని, ఎవరైనా చనిపోతే శవాన్ని తీసుకెళ్లాలన్నా దారి లేదని వాపోయారు. వెంటనే సమస్య పరిష్కరించాలని కోరారు.

స్కీమ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

స్కీమ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖరరెడ్డి, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు నాగరాజమ్మ డిమాండ్ చేశారు. వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించి, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని కోరారు. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ గౌరవాధ్యక్షుడు శివకుమార్, సుశీల, నాగమణి, సుబ్రహ్మణ్యం, మంగమ్మ పాల్గొన్నారు.

పింఛను ఇప్పించి పుణ్యం కట్టుకోండి

అయ్యా..నేను పుట్టుకతో దివ్యాంగురాలిని. 2014లో ఎన్టీఆర్ భరోసా పింఛను వచ్చేది. జగన్ ప్రభుత్వం రాగానే రద్దు చేశారు. ఐదేళ్లుగా పింఛను కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఒక్క అధికారి కూడా సమాధానం చెప్పడం లేదు. మీరైనా స్పందించి పింఛన్ ఇచ్చేటట్టు చూడండి.

- సులోచనమ్మ, గోవర్ధనపురం, వరదయ్యపాళెం మండలం



సదరం సర్టిఫికెట్ ఉన్నా పింఛను ఇవ్వడంలేదు

అయ్యా.. అనారోగ్యం కారణంగా కుడికాలు పూర్తిగా తొలగించారు. జీవనోపాధిలేక ఇబ్బంది పడుతున్నా. సదరం సర్టిఫికెటు ఇచ్చినా కూడా అధికారులు పింఛను మంజూరు చేయడం లేదు. మీరైనా న్యాయం చేయండి.

- విష్ణు, అడవి కొడియంబేడు, పిచ్చాటూరు మండలం



అస్వస్థతకు గురైన కార్మికులను ఆదుకోండి



వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

నారాయణవనం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్కీ4 యూ ఎక్స్‌మమ్ కంపెనీలో జరిగిన ప్రమాదం కారణంగా అస్వస్థతకు గురైన కార్మికులను ఆదుకోవాలని సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు జనార్ధన్, నాయకులు వెంకటేష్, సీపీఐ నాయకులు మహేష్ మాట్లాడుతూ శనివారం అర్ధరాత్రి జరిగిన గ్యాస్ లీకేజీ ప్రమాదంలో అస్వస్థతకు గురైన కార్మికులను ఆదుకోవాలని కోరారు. కార్మికులకు కంపెనీకి సంబంధించిన అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. అనంతరం తహసీల్దార్ జయరాములు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మునిశంకర్, రామచంద్రారెడ్డి, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

పీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



నారాయణవనం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండల విద్యాశాఖ కార్యాలయంలో సోమ వారం పుత్తూరు డివిజన్ విద్యాశాఖాధికారి ప్రభాకర్‌రాజు, నారాయణవనం విద్యాశాఖాధికారి జనార్ధన్‌రాజు చేతుల మీదుగా పీఆర్టీయూ క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పీఆర్టీయూ ప్రధాన కార్యదర్శి సదాశివన్, మండల అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్, జానకిరామన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జయరామరావువీధిలో ట్రాఫిక్ ఇక్కట్లు



శ్రీకాళహస్తి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తిలోని జయరామ రావు వీధిలో ప్రజలకు నిత్యం ట్రాఫిక్ ఇక్కట్లు తప్పడంలేదు. ఈ ప్రాంతంలో ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా రద్దీ వేళల్లో కొందరు వ్యాపారులు భారీ వాహనాలతో సరుకులు లోడింగ్, అన్‌లోడింగ్ చేస్తున్నారు. పట్టణ నడిబొడ్డు ప్రాంతం కావడంతో ఇక్కడ వాహనాలు స్తంభించిపోతున్నాయి. సోమవారం కొందరు స్థానికులు అధికారుల తీరును నిరసిస్తూ మాధ్యమాల్లో పెద్దఎత్తున్న పోస్టులు పెట్టడంతో చర్చనీయాంశంగా మారింది. సంబంధిత అధికారులు స్పందించి రద్దీ వేళల్లో వ్యాపారులు వాహనాలు నిలపకుండా పర్యవేక్షించాల్సి ఉంది.

సింగిల్ విండో మాజీ డైరెక్టర్‌కు సీపీఐ నివాళి

బీఎన్‌కండ్రిగ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జంబుగోళం గ్రామానికి చెందిన సీపీఐ నాయకురాలు, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ కత్తిఅంకమ్మ (78) సోమవారం మృతి చెందారు. ఆమె మృతికి పలువురు నాయకులు నివాళులు అర్పించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, జిల్లా కార్యదర్శి మురళి, జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచులయ్య, రాధాకృష్ణ, విశ్వనాథ్, జనమాల గురవయ్య, బండి చలపతి, ఉదయకుమార్ తదితరులు అంకమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అంకమ్మకు కత్తి ధర్మయ్య, కత్తి రవి ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరు కూడా తల్లిబాటలోనే సీపీఐ లో కొనసాగుతున్నారు.

వ్యవసాయ స్టార్టర్ల ధ్వంసం..రాగి వైరు చోరీ



వేలవేడులో ధ్వంజమైన స్టార్టర్

శ్రీకాళహస్తి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ స్టార్టర్లను ధ్వంసం చేసి వాటిలోని రాగి వైరును గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. సోమవారం పలుచోట్ల ఈ చోరీలు జరిగాయి. శ్రీకాళహస్తి మండలంలోని వేలవేడు గ్రామంలో సుబ్బరామయ్యకు చెందిన నాలుగు స్టార్టర్లు ధ్వంసం చేశారు. శ్రీనివాసులుయాదవ్, మాధవమాల గ్రామానికి చెందిన శీనయ్య, శివశంకర్‌యాదవ్ స్టార్టర్లు, రాధాకృష్ణయ్యకు చెందిన మూడు స్టార్టర్లు ధ్వంసం చేసి రాగివైరును చోరీ చేశారు. అలాగే శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన ప్రసాద్ తొట్టంబేడు గ్రామ పరిధిలోని పొలంలో వ్యవసాయం చేస్తుంటాడు. ఆయన పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేశారు.

రోడ్డు ప్రమాదంలో రైతుకు తీవ్రగాయాలు

శ్రీకాళహస్తి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తిరుపాల్(45) అనే రైతు తీవ్రంగా గాయపడ్డాడు. శ్రీకాళహస్తి రూరల్ సీఐ రవినాయక్ కథనం మేరకు.. శ్రీకాళహస్తి మండలం వాగివేడుకు చెందిన తిరుపాల్ వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. భార్య జయంతితో కలిసి సోమారం సొంత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంలో శ్రీకాళహస్తికి వచ్చారు. పని ముగించుకుని రాత్రి తిరిగి దంపతులు ఇంటికి బయలుదేరారు. ఊరందూరు వద్ద పంగూరు రహదారిపై రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో తిరుపాల్ తీవ్రంగా, ఆయన భార్య జయంతి స్వల్పంగా గాయపడ్డారు. అలాగే మరో ద్విచక్రవాహనంపై ఉన్న వ్యక్తి ఘటనా స్థలం నుంచి పరారయ్యాడు. స్థానికులు క్షతగాత్రులను శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపాల్‌ను తిరుపతి రుయాకు రెఫర్ చేశారు.

ఉపాధికూలీ మృతికి సంతాపం



ఏర్పేడు, జనవరి 6(ఆంధ్ర జ్యోతి): ఉపాధి హామీ పథకం కూలీ ఒకరు మృతి చెందడంతో సహచర కూలీలు ఆమె మృతికి సంతాపం తెలిపారు. ఏర్పేడు మండలం బండారుపల్లికి చెందిన అమ్ములు ఉపాధి హామీ కూలీకి వచ్చేది. రెండురోజుల క్రితం గుండె సమస్యతో చెన్నైలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం మృతిచెందింది. ఈ క్రమంలో సోమవారం సహచర కూలీలు పనివద్ద ఆమె మృతికి కాసేపు మౌనం వహించి సంతాపం తెలిపారు.

ప్రజా సమస్యలను పరిష్కరించండి



వరదయ్యపాళెం, జన వరి 6 (ఆంధ్ర జ్యోతి): వరదయ్యపాళెం మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని బీజేపీ మండల అధ్యక్షుడు దిలీప్ రాయల్ అధికారులను కోరారు. వెలగపూడిలోని రెవెన్యూశాఖ మంత్రి కార్యాలయంలో అధికారులకు సోమవారం వినతిపత్రం అందజేశారు. భూసమస్యలు, ప్రజా సమస్యలను వివరించారు. అదేవిధంగా వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, వంతెనలు బాగుచేయాలని కోరారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

నేడు సూళ్లూరుపేటలో కలెక్టర్ పర్యటన

దొరవారిసత్రం-తడ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట వేదికగా ఈ నెల 17, 18, 19 తేదీల్లో మూడు రోజుల పాటు ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహించనున్న నేపథ్యంలో కలెక్టర్ వెంకటేశ్వర మంగళ వారం పర్యటిస్తున్నారు. ఉదయం 10.30 గంటలకు దొరవారిసత్రం మండల పరిధిలోని నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రాన్ని పరిశీలిస్తారు. పక్షుల విడిది ప్రధాన కేంద్రమైన నేలపట్టుకు మూడు రోజుల్లో విచ్చేసే సందర్శకులకు ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిసారు. అలాగే పులికాట్ సరస్సులోని అటకానితిప్ప, తడ మండలంలోని బీవీ పాళెం బోటు షికారు ప్రాంతం, అక్కడి టూజం భవనాలను పరిశీలిస్తారు. అలాగే ఫ్లెమింగో ఫెస్టివల్ ప్రధాన వేదిక అయిన సూళ్లూరుపేట జూనియర్ కాలేజీ ప్రాంగణాన్ని పరిశీలిస్తారు. అనంతరం సూళ్లూరుపేటలో అన్నిశాఖల అధికారులతో పక్షుల పండుగపై కలెక్టర్ సమీక్ష నిర్వహించనున్నారు.

తాళంవేసి ఉన్న ఇంట్లో చోరీ

తడ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): తాళంవేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... మండల పరిధిలోని చేనిగుంట గ్రామానికి చెందిన కొమ్మల రవి శ్రీసిటీ సెజ్‌లోని ఓ పరిశ్రమలో సెక్యూరిటీగా పనిచేస్తుంటాడు. ఆదివారం రాత్రి అతను విధులకు హాజరుకాగా కుటుంబసభ్యులు ఇంటికి తాళాలు వేసుకొని బయట ఊరికి వెళ్లారు. సోమవారం ఉదయం వచ్చేసరికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తెరచి ఉండటంతో పాటు అందులోని 2 సవర్ల బంగారు నగలు కన్పించకపోయేసరికి చోరీ జరిగినట్లుగా నిర్ధారించుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అద్దెల భారం ఎన్నాళ్లు?

- వైసీపీ హయాంలో టిడ్కో ఇళ్ల కేటాయింపునకు ఎగనామం
- కూటమి ప్రభుత్వం రావడంతో లబ్ధిదారుల్లో చిగురించిన ఆశలు



మన్నారుపోలూరులో నిర్మాణం పూర్తి చేసుకొన్న టిడ్కో ఇళ్లు

సూళ్లూరుపేట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కల సాకారాన్ని వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం చేయడంతో నేటికీ టిడ్కో ఇళ్ల కేటాయింపు జరగలేదు. 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం పేదలకు సొంతింటి కల సాకారం చేసేందుకు పీఎంఏవై - ఎన్టీఆర్ నగర పథకం కింద మన్నారు పోలూరు సమీపంలో సూళ్లూరుపేట - శ్రీకాళహస్తి రోడ్డును ఆనుకొని టిడ్కో ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. 2018 చివరిలో ఆన్‌లైన్ విధానంలో లాటరీ పద్ధతిలో టిడ్కో ఇళ్లను కేటాయింపులకు అధికారులు సిద్ధమయ్యారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ టిడ్కో ఇళ్ల పంపిణీని జాప్యం చేయడంతో పాటు కేటాయింపులను రద్దు చేసింది. అప్పటినుంచి ఇళ్లను తీసుకొన్న లబ్ధిదా రులకు కేటాంపు ప్రక్రియను వాయిదాలు వేస్తూ వచ్చింది. 2023 సంక్రాంతికి టిడ్కో ఇళ్లకు పాలు పొంగించి ఇస్తామని ఆర్భాటంగా చెప్పింది. అనంతరం ఉగాది అంటూ మరోసారి వాయిదా పడింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో టిడ్కో ఇళ్ల పంపిణీపై దృష్టి సారించింది. సంక్రాంతి తరువాత లబ్ధిదారులకు అన్ని వసతులు కల్పించి ఇచ్చేందుకు కసరత్తు చేస్తోంది. సూళ్లూరుపేటలో పీఎంఏవై - ఎన్టీఆర్ నగర పథకం కింద దాదాపు 1632 ఇళ్లు మంజూరయ్యాయి. జీ-3 ఆకృతితో 31 విభాగాల్లో 32 చొప్పున 932 ఇళ్లు నిర్మించారు. 500 చదరపు అడుగుల్లో బెడ్‌రూమ్, హాలు, వంటగది, అటాచ్డ్ బాత్‌రూమ్ అదనంగా నిర్మితమైన ఫ్లాట్లకు లబ్ధిదారులు తమవంతు వాటాను డీడీల రూపం లో ఎప్పుడో చెల్లించారు. వైసీపీ పాలనలో ఐదేళ్లు వారి నిరీక్షణకు మోక్షం లభించడం లేదు. 90 శాతం పైబడి ఇళ్ల నిర్మాణాలు పూర్తయినా కేటాయించలేదు. కూటమి ప్రభుత్వం టిడ్కో ఇళ్లపై ప్రత్యేక దృష్టిసారించి పూర్తయిన ఇళ్లకు మౌలిక వసతులు కల్పించి త్వరితగతిన పూర్తి చేసి అందించాలనే లక్ష్యంతో ముందుకెళ్తోంది.

అప్పులు చేసి వాటాను చెల్లించి..

మరోవైపు టిడ్కో ఇళ్ల ఆశలు పెట్టుకొని అప్పుచేసి మరీ వాటాను చెల్లించిన లబ్ధిదారులు నానా అవస్థలు పడుతున్నారు. సొంతింటి కల నెరవేరుతుందన్న ఆనందంతో అప్పోసొప్పో చేసి వాటాను చెల్లించిన ప్రజలు వడ్డీలు కట్టుకోలేక, అద్దె ఇళ్లకు బాడుగలు చెల్లించలేక అవస్థలు పడుతున్నారు. ఇదిలా ఉండగా సూళ్లూరుపేట మున్సిపాలిటీగా మారడం, ఈ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందడంతో పాటు జిల్లాల పునర్విభజనతో రెవెన్యూ డివిజన్ కేంద్రం చేయ డంతో అద్దెలు అమాంతంగా పెరిగిపోయాయి. కేవలం రెండు గదులున్న ఇంటికి నెలకు రూ.5 వేల నుంచి రూ.7 వేల దాకా చెల్లించాల్సి వస్తోంది. కరెంట్ ఇతరత్రా ఖర్చులు సైతం ప్రజలకు భారంగా మారింది. చివరికి శివారు కాలనీల్లోనూ సైతం అద్దెల మోత మోగుతుండ టంతో అప్పుచేసి మరీ బతుకులు నెట్టుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి ఇళ్లను త్వరితగతిన కేటాయించాలని సూళ్లూరుపేట ప్రజలు కోరుకొంటున్నారు.

ఆర్డీవో కార్యాలయం వద్ద ఆకతాయిల బెడద

సీసీ కెమెరాల ధ్వంసం, పక్కనే ఉన్న బంకులో చోరీ





ఆర్డీవో కార్యాలయ సీసీ కెమెరాలను ధ్వంసం చేసిన ఆకతాయిలు - ఆటో అద్దాలను పగలగొట్టిన దృశ్యం

సూళ్లూరుపేట, జనవరి 6(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ఆర్డీవో కార్యాలయం వద్ద రాత్రి వేళల్లో ఆకతాయిల బెడద ఎక్కువైంది. శ్రీహరికోటకు వెళ్లే ఫ్లైఓవర్ సమీపంలో ఉన్న రైతు సహకార సేవా సంఘం భవనం మిద్దె పైన ఆర్డీవో కార్యాలయంఏర్పాటు చేశారు. రాత్రి అయితే కొందరు యువకులు అక్కడకు వచ్చి మద్యం సేవించి బాటిళ్లను సైతం అక్కడే పడేసి వెళ్తున్నారు. ఆదివారం రాత్రి గుర్తుతెలియని యువకులు ఆర్డీవో కార్యాలయం బటయ ఏర్పాటు సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. పక్కనే చిన్నబంకులో చోరీకి పాల్పడ్డారు. కూల్‌డ్రింగ్స్ బాటిళ్ల, తినుబండరాల ప్యాకెట్లను ఎత్తుకెళ్లారు. బంకు పక్కనే ఉన్న ఆటో అద్దాలను ధ్వంసం చేశారు. సోమవారం ఉదయం కార్యాలయ సిబ్బంది గమనించి ఆర్డీవో కిరణ్మయికి సమాచారం అందించారు. పక్కనే ఉన్న మరో సీసీ కెమెరా ఫుటేజ్ ద్వారా ఆకతాయిలాలను గుర్తించేందుకు ప్రయత్నించగా శనివారం సాయంత్రం నుంచి సీసీ కెమెరాకు విద్యుత్ సరఫరా ఆపివేసి ఉండడంతో రికార్డు కాలేదు. రైతు సహకార సంఘం ఉన్న సీసీ ఫుటేజ్‌లను పరిశీలించగా ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో కొందరు యువకులు కేక్ కట్‌చేసి పార్టీ చేసుకొని మద్యం సేవిస్తూ కనిపించారు. అదేరోజు రాత్రి 12:06 గంటలకు కేక్ కట్ చేసిన పార్టీలో పాల్గొన్న ఓ యువకుడు సీసీ కెమెరా ధ్వంసమైన ప్రాంతాల్లో తిరుగుతున్నట్లు కనిపించింది. ఇదంతా మందుబాబుల పనిగా అనుమానిస్తున్నారు. కాగా, ఆర్డీవో కార్యాలయ ప్రాంతంలో సాయంత్రం 6గంటలు దాటితే ఆకతాయిల బెడద ఎక్కువగా ఉంది. పరిశ్రమలకు వెళ్లే బస్సులు, ఇతర వాహనాలను ఆర్డీవో కార్యాలయ సమీపంలో బ్రిడ్జి పక్కనే పార్కింగ్ చేస్తుంటారు. ఆ వాహనాల పక్కనే ఆకతాయిలు మద్యం తాగుతూ ఉండడంతో ఉద్యోగులు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. పోలీసులు రాత్రి వేళల్లో ఆర్డీవో కార్యాలయ ప్రాంతంలో గస్తీ పెంచాల్సిన అవసరం ఉంది.

రోడ్లకు మరమ్మతులు చేయండి

చిట్టమూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): చిట్టమూరు మండలంలోని ప్రధాన రోడ్ల దుస్థితి దారుణంగా ఉంది. ప్రధానంగా మెట్టు సమీపంలోని కోట, నాయుడుపేట రోడ్లు పెద్దపెద్ద గోతులు పడి ప్రమాకరంగా ఉన్నాయి. మెట్టు గ్రామం నుంచి సుమారు రెండొందల మీటర్ల వరకు అడుగడుగునా గోతులు ఏర్పడ్డాయి. గత ప్రభుత్వంలో భారీ వాహ నాలతో ఇసుక అక్రమ రవాణా జరగడం వల్లే రోడ్లు దెబ్బతిన్నాయని ప్రజలు విమర్శిస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వార్డు సచివాలయంలో గ్రీవెన్స్

వెంకటగిరి టౌన్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలోని 8వ వార్డు సచివాలయంలో కౌన్సిలర్ ఆరి శంకరయ్య ఆధ్వర్యంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. వార్డు పరిధిలోని బొగ్గులమిట్ట, ధర్మాపురం, నరసింహారవు, ముత్తరాశి పాళెం ప్రాంతాల ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందజేశారు.

గ్రీవెన్స్ ఫిర్యాదులపై చర్యలేవీ?

పెళ్లకూరు. జనవరి 6 (ఆంధ్రజ్యోతి): గ్రీవెన్స్ సెల్‌లో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని చిల్లకూరు సర్పంచు పగడాల హరిబాబురెడ్డి, గ్రామస్తులు సోమవారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. చిల్లకూరు మండలంలోని మేత భూముల ఆక్రమణలపై రెండు నెలల కిందట గ్రీవెన్స్‌లో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. మేత పోరంబోకు భూముల్లో వరి సాగు చేస్తున్నారని, దాంతో గ్రామంలో పశువులను మేపుకునేందుకు స్థలం లేక ఇబ్బందులకు గురవుతున్నామని అన్నారు. మేత పోరంబోకు భూముల ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

పంటకాలువ ఆక్రమణపై కలెక్టర్‌కు ఫిర్యాదు

నాయుడుపేట, జనవరి 6(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మండలం పండ్లూరు వద్ద ఉన్న పంట కాలువను ఓ ఫ్యాక్టరీ యాజమాన్యం ఆక్రమించినట్లు అదే గ్రామానికి చెందిన రైతు కస్తూరయ్య సోమవారం తిరుపతి కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్‌లో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అలాగే ఫ్యాక్టరీ నుంచి వెలువడుతున్న కలుషిత నీటిని పొలాల్లోకి వదిలేస్తున్నారని, దీనివల్ల పంటలు దెబ్బదింటున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలివ్వండి

సూళ్లూరుపేట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పేదలకు మంజూరు చేసే ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని సీపీఐ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన చేశారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆర్డీవో ఈ.కిరణ్మయికి వినతిపత్రం అందజేశారు.



చిత్తూరు జిల్లా కుప్పం పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడితో మాజీ ఎంపీ పనబాక లక్ష్మి

పుత్తూరు వార్తలు

మామిడికి మంచు దెబ్బ

ఇప్పటికీ కానరాని పూత ● దిగాలు పడుతున్నరైతన్న



పూతలేని మామిడి తోట

పుత్తూరు టౌన్/ వడమాలపేట జనవరి 6(ఆంధ్రజ్యోతి): వాతావరణ పరిస్థితుల ప్రభావంతో రెండు, మూడేళ్లుగా మామిడి పూత ఆలస్యంగా వస్తోంది. అలాగే తెగుళ్ల బారిన పడిన మామిడి రైతులు నష్టపోతూనే ఉన్నారు. సాధారణంగా నవంబరు, డిసెంబరు నెలల్లోనే మామిడి పూతలు ఏర్పడి, జనవరిలో పిందెలుగా మారి మార్చి, ఏప్రిల్ నెలలో మామిడి దిగుబడి ఉంటుంది. ఫెంగల్ తుఫాను ప్రభావంతో కురిసిన వరుస వర్షాలకు తోడు విపరీతంగా కురుస్తున్న మంచు కారణంగా భూమిలో తడి శాతం ఎక్కువైంది. ఫలితంగా మామిడి పూత కనపడటం లేదు. దీంతో ఈ ఏడాది మామిడి దిగుబడి తగ్గి డిమాండ్ కలిగే పరిస్థితులు కనబడుతున్నాయి.

మామిడి విస్తీర్ణం ఎంతంటే..

పుత్తూరు ఉద్యానవనశాఖ పరిధిలోని పుత్తూరు మండలంలో 4900 ఎకరాలు, వడమాలపేటలో 5500, విజయపురంలో 2100 ఎకరాలు, నారాయణవనంలో 950 ఎకరాలలో మామిడి సాగు చేస్తున్నారు. వాతావరణం అనుకూలించక పూత రాకపోవడంతో రైతన్నలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

దిగబడులపై ఆందోళన

ప్రస్తుత పరిస్థితుల్లో పూత వచ్చినా ఈ ఏడాది 25 శాతం కూడా దిగుబడులు వచ్చే అవకాశాలు ఉండదని అధికారులు భావిస్తున్నారు. మరోపక్క ఆలస్యంగా వచ్చే పూత నిలబడుతుందా లేదా అని రైతులు సంశయంలో ఉన్నారు. ఎండలు వస్తే తోటను తేలికగా దున్ని భూమిలో తేమ ఆరేలా చేసి మందులు పిచికారి చేస్తే ఫలితం ఉంటుందని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

మామిడి పూత రావాలంటే



పూత రాని తోటలలో పొటాషియం నైట్రేట్ (మల్టీకే) లేదా 13045 ను పది గ్రాములు నీటిలో కలిపి పిచికారి చేయాలి. దానితో పాటు మల్టీ సూక్ష్మ పోషకాలు ఒక లీటర్ నీటిలో 5 గ్రామలు కలిపి పిచికారి చేయాలి.

- వెంకట సౌజన్య, ఉద్యానవనశాఖాధికారి

పూత రావడం లేదు



వరుస వర్షాలు, విపరీతంగా కురుస్తున్న మంచు కారణంగా మామిడి పూత రాలేదు. డిసెంబరు లోనే పూత రావాల్సి ఉంది. ఇప్పటికీ రాలేదు. పూత కోసం వేలకు వేలు వెచ్చించి మందులు పిచికారి చేసినా ఫలితం కనిపించడం లేదు.

- కే.వర్మ, ఎస్‌బీఆర్ పురం

దిగుబడి లేనట్లే



జన వరిలోనే పిందెలుగా కనప డాల్సిన మామడి, ఈ ఏడాది పూతలు సైతం కనిపించడం లేదు. దీనికి తోడు భూమిలో తేమ శాతం ఎక్కువగా ఉండడం వలన పూత రాలేదు. అప్పులు చేసి మామిడి పంటకోసం వెచ్చించాం. నేడు నష్టాల బారిన పడాల్సిన పరిస్థితి కనపడుతోంది.

- శ్రీధర్, చెర్లోపల్లి



వడమాలపేటలో పూత కోసం మందులు పిచికారీ చేస్తున్నరైతు

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



పుత్తూరు అర్బన్, జనవరి6 (ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం 2025 నూతన క్యాలెండర్‌ను పుత్తూరు మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ సోమవారం ఆవిష్కరించారు. ఉద్యోగుల సంఘం నాయకులు ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు తాలూక ప్రెసిడెంట్ రవికుమార్, కార్యదర్శి మోహన్‌బాబు, జాయింట్ సెక్రటరీ శ్రీనివాసులు, వైస్ ప్రెసిడెంట్‌లు తిరులయ్య, పెంచలయ్య పాల్గొన్నారు.

దివ్యాంగ పింఛన్‌దారుల విచారణ



పుత్తూరు టౌన్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): పుత్తూరు మండలంలోని తడుకు, శిరుగురాజుపాలెం పంచాయితీలో దివ్యాంగుల పింఛన్‌దారుల వద్ద అధికారులు సోమవారం తనిఖీలు చేపట్టారు. నెల్లూరు జిల్లా వైద్యాధికారులు హరిప్రసాద్, రేణుక, ఆషాలు విచారించారు. దివ్యాంగ నిర్ధారణ పత్రాలను పరిశీలించారు. వీరితో పాటు ఎంపీడీవో రమేష్‌బాబు, కార్యదర్శి నరేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



పుత్తూరు టౌన్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): పుత్తూరులోని రాస్ కార్యాలయంలో రాస్ సంస్థ మాజీ అధ్యక్షులు గుత్తా మునిరత్నం జయంతిని పురస్కరించకుని రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఎన్టీఆర్ ట్రస్ట్ వారి సహకారంతో సిద్ధార్థ, వెంకటపెరుమాళ్ కళాశాల విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన చిత్తూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి చినబాబు చేతుల మీదుగా రక్తదానం చేసినవారికి సర్టిఫికెట్లు అందజేశారు. రాస్ అధికారులు రవి, శేఖర్, తేజ, కమల పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే ఆదిమూలం



పిచ్చాటూరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): కుప్పం పర్యటనలో ఉన్న సీఎం చంద్రబాబును సోమవారం సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి ముందస్తు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నియోజకవర్గంలో అభివృద్ధి పనులపై ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పుత్తూరు-అత్తిపట్టు నూతన రైల్వేలైన్ నిర్మాణంపై సీఎంతో చర్చించారు. సీఎం నుంచి సానుకూల స్పందన లభించినట్లు ఎమ్మెల్యే వివరించారు.

అంజలికి అభ్యుదయ రైతు పురస్కారం ప్రదానం


మంత్రి అచ్చెన్నాయుడు చేతుల మీదుగా అవార్డు స్వీకరిస్తున్న అంజలి

పిచ్చాటూరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పంబట్టు గ్రామానికి చెందిన అంజలి అనే మహిళ రైతు ప్రకృతి వ్యవసాయం పురోగతికి చేసిన సేవలు గుర్తించిన ప్రభుత్వం అభ్యుదయ రైతు పురస్కారాన్ని అందజేసింది. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. ఆమెకు శాలువ కప్పి పుష్పగుచ్ఛం అందించి జ్ఞాపికతో సత్కరించారు.

మామండూరు రోడ్డుకు మరమ్మతులు



కరకంబాడికి వెళ్లే మార్గంలో వంతెనపై రోడ్డు మరమ్మతు పనులు చేస్తున్న దృశ్యం

రేణిగుంట, జనవరి 6(ఆంధ్రజ్యోతి) : మామండూరు రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభించారు. ఈ మార్గంలో రోడ్డు దుస్థితిపై 'గుంతలమయంగా మారిన మామండూరు రోడ్డు' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన నేషనల్ హైవే అధికారులు సోమవారం కొత్త చెక్‌పోస్టు వద్ద ఏర్పడిన గోతులకు ప్రత్యేకంగా మరమ్మతు పనులు చేపట్టారు. రేణిగుంట నుంచి కడప వరకు మొత్తం 120 కిలోమీటర్ల పొడవున రూ.2 కోట్ల నిధులతో మరమ్మతులకు శ్రీకారం చుట్టారు. ఆ మేరకు వివరాలను నేషనల్ హైవే ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు.

సైన్స్, గణితంలో ఉత్తీర్ణత పెంచడానికే స్టెమ్ ల్యాబ్ ఏర్పాటు


స్టెమ్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

ఏర్పేడు, జనవరి 6 (ఆంధ్ర జ్యోతి): బ్రాడ్‌కామ్ సంస్థ ఆర్థిక సహాయంతో బెంగళూరుకు చెందిన క్రై సంస్థ, తిరుపతికి చెందిన ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పేడు మండలం పల్లం జడ్పీ ఉన్నత పాఠశాలలో స్టెమ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. ప్రగతి సంస్థ డైరెక్టర్ కేవీ రమణ మాట్లాడుతూ ఏర్పేడు మండలంలో గ్రామీణ ప్రాంతాల్లో ఎస్సీ, ఎస్టీ జనాభా అధికంగా ఉన్నారన్నారు. వారిలో విద్యపై ఆసక్తి పెంచడానికి ఒక్కో పాఠశాలకు రూ.7లక్షలు విలువ చేసే స్టెమ్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే డ్రాపౌట్లు తగ్గి, బాలకార్మిక, బాల్యవివాహాలు తగ్గుతాయని ఆకాం క్షించారు. ఈ కార్యక్రమంలో ప్రగతి సంస్థ సిబ్బంది శిరీష, ప్రభాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదలకు ఇంటి పట్టాలు ఇవ్వండి


ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

శ్రీకాళహస్తి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం పట్టణ ప్రాంతాల్లో పేదలకు రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు మూడుసెంట్లు ఇంటి స్థలాలు, నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి డిమాండ్ చేశారు. సోమవారం ఆర్డీవో కార్యాలయం వద్ద సీపీఐ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మికసంఘం ఆధ్వర్యంలో ఇళ్ల స్థలాల సామూహిక అర్జీ సమర్పణ ధర్నాను నిర్వహించారు. ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు జనమాల గురవయ్య, చిన్నం పెంచులయ్య, మించల శివకుమార్, గోపి, చందు తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు


అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దారు

కేవీబీపురం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): రైతులు తమ పొలాల సమస్యలను పరిష్కరించుకోవడానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేసిందని తహసీల్దారు మునిరత్నంరెడ్డి చెప్పారు. సోమ వారం మండలంలోని తిమ్మసముద్రం, రాగిగుంట గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో తిమ్మసముద్రం సర్పంచ్, మండల టీడీపీ అధ్యక్షుడు రామాంజుల నాయుడు, రైతు అధ్యక్షుడు గోపినాథ్‌రెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి మునస్వామియాదవ్, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించండి


అధికారులతో మాట్లాడుతున్న గుత్తి త్యాగరాజు

వరదయ్యపాళెం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని సమస్యలను పరిష్కరించాలని సీసీఆర్ రాష్ట్ర కార్యదర్శి గుత్తి త్యాగరాజు కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కోరారు. తిరుపతి కలెక్టరేట్‌లో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరానగర్ పంచాయతీ భవనం ప్రారంభించాలని, ఎంపీడీవో కార్యాలయంలో పోస్టులు భర్తీ చేయాలని, పేదలకు ఇంటిస్థలాల పంపిణీ చేయాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అధికారులు సానుకూలంగా స్పందించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ఆసరా డబ్బులు ఇప్పించండి మహాప్రభో..!


నవనీతమ్మ

వరదయ్యపాళెం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): వరదయ్యపాళెం మండలం గోవర్ధనపురం చెందిన నవనీతమ్మ ఆసరా పథకం డబ్బులు అందించాలని తిరుపతి కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారుల ఎదుట వాపోయారు. తన ఖాతాలో నగదు అందించకుండా కొందరు కాజేశారని ఆరోపించారు. గత ప్రభుత్వంలో అనేకమార్లు అధికారులకు విన్నవిస్తే ఒకసారి ఒక దఫా మొత్తాన్ని ఇప్పించారన్నారు. మిగిలిన మొత్తం కోసం విన్నవించుకుంటున్నా ఫలితం లేకపోయిందన్నారు. కూటమి ప్రభుత్వంలో అయినా తనకు న్యాయం చేయాలని కోరింది. కలెక్టర్ స్పందిస్తూ సమస్య పరిష్కారానికి వీలైనంత త్వరగా పరిష్కరిస్తామన్నారు.

శ్మశాన భూమికి హద్దులు చూపండి


తహసీల్దార్‌కి వినతిపత్రం అందిస్తున్న జనసేన నాయకులు

నాగలాపురం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నాగలాపురంలో శ్మశానానికి కేటాయించిన భూమికి హద్దులు చూపాలని జనసేన నాయకులు తహసీల్దార్‌కి వినతి పత్రం అందించారు. సోమవారం నాగలాపురంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల దినోత్సవంలో భూ సమస్యలకు సంబంధించి పలు అర్జీలు అందాయి. ఇందులో భాగంగా జనసేన నాయ కులు తహసీల్దార్ హనుమాన్‌నాయక్‌కు వినతి అందించారు. జనసేన మండల ఉపాధ్యక్షులు లీలా ప్రసాద్, నాయకులు దేవ, దొరబాబు, జీవ, నజుర్, రూపేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఆలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

రేణిగుంట, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని ఆలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని పోలీసులు సూచించారు. స్థానికంగా ఓ ప్రైవేటు కళ్యాణ మండపంలో సోమవారం ఆలయాల నిర్వాహకులతో డీఎస్పీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు పోలీసులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గాజుల మండ్యం సీఐ మురళీకృష్ణ మాట్లాడుతూ ఆలయాలకు స్మార్ట్ లాకులు ఉపయోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఎస్ఐ అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

వేదోక్తంగా మృత్యుంజయ పూజలు

శ్రీకాళహస్తి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మృత్యుంజయ స్వామికి సోమవారం ఆగమోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా వినాయకస్వామికి పలు రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి కర్పూర హారతులు ఇచ్చారు. అనంతరం మృత్యుంజయ స్వామివారికి మొదట పాలు, పంచామృతం, చందనం, విభూది, పచ్చ కర్పూరంతో వైభవంగా అభిషేకాలు నిర్వహించారు. వివిధ పుష్పాలతో, గజమాల, వెండి నాగాభరణంతో స్వామివారిని శోభాయ మానంగా అలంకరించారు. ధూప, దీప నైవేద్యాలు, మహామంగళ హారతులు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు.

కిశోరి వికాసం సదస్సు

వరదయ్యపాళెం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం కిశోర వికాసం అవగాహన సదస్సు సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి అంగన్వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు హాజరయ్యారు. సీడీపీవో దేవకుమారి, వైద్యాధికారి అనిత వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో సరస్వతి, ప్రగతి ట్రస్టు కో-ఆర్డినేటర్ సుబ్రహ్మణ్యం, ఎంపీహెచ్‌వో మధుబాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు బజావతి, జ్యోతి, శిల్ప పాల్గొన్నారు.

పిచ్చాటూరు: కిషోరి వికాసంతో యువతుల్లో మనోవికాసం పెంపొందుతుందని తద్వారా బంగారు భవిష్యత్ లభిస్తుందని ఎస్ఐ వెంకటేశ్వరులు తెలిపారు. సోమవారం మండల పరిషత్ మీటింగ్ హాలులో కిషోరి వికాసం కార్యక్రమంపై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో సీడీపీవో శోభారాణి, ఎంపీడీవో మహ్మద్‌రఫీ, డాక్టర్ హమీద్, ఎంఈవో హేమమాలిని, సూపర్‌వైజర్ మారెమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు, పోలీసులు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇసుక తరలింపునకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

బీఎన్‌కండ్రిగ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాళంగి నది, ఇతర వాగుల నుంచి ఇసుక తరలింపునకు సంబంధించి వాహనాలకు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తహసీల్దార్ సుబ్రమణ్యం తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పోలీసుల సిబ్బంది, కార్యదర్శులు, వీఆర్వోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎస్ఐ విశ్వనాథనాయుడు, ఎంపీడీవో త్రివిక్రమరావు, ఈవోపీఆర్డీ రాజశేఖర్ పాల్గొన్నారు.

మా ఇంటికి దారేది..!

- నడిరోడ్డుపై రాతి స్తంభం నాటారు
- దారి మూసేశారు
- దారి చూపాలని వేడుకుంటున్న రైతు



బాధిత రైతు జనార్ధన్, రోడ్డుకు అడ్డంగా నాటిన రాతి స్తంభం,

శ్రీకాళహస్తి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): 'మా ఇంటికి దారేది' అంటూ జనార్ధన్ అనే రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. శ్రీకాళహస్తి పట్టణం బీపీ అగ్రహారంలోని ఇసుకదిబ్బ వద్ద జనార్ధన్ అనే రైతుకు నివాస గృహం ఉంది. ఆ పక్కనే మరో ఖాళీ ఇంటిస్థలం, మరో రెండు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. వ్యవసాయం, ఎడ్లబండి తోలుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. ఈయన ఇంటికి వెళ్లే సిమెంటు రోడ్డు మధ్యలో కొద్దిరోజుల క్రితం అదే వీధికి చెందిన కొందరు రాతిస్తంభం నాటారు. అప్పటి నుంచి ఎడ్ల బండితో ఇంటి వద్దకు, పొలానికి వెళ్లలేక ఇబ్బంది పడుతున్నాడు. పక్కవీధిలో బంధువుల వద్ద ఎద్దులబండిని ఉంచి ఇంటికి రావాల్సి వస్తోందని వాపోతున్నాడు. మున్సిపల్ , రెవన్యూ అధికారులు స్పందించి తమకు దారి సమస్యను పరిష్కరించాలని జనార్ధన్ విజ్ఞప్తి చేస్తున్నాడు.

కుర్రకాలువ రోడ్డుకు మోక్షం

రూ.6.20 కోట్లతో నిర్మాణ పనులు ప్రారంభం



రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అధికారులు

రేణిగుంట, జనవరి 6(ఆంధ్రజ్యోతి) : రేణి గుంట - శ్రీకాళహస్తి మార్గంలో ఎట్టకేలకు కుర్ర కాలువ రోడ్డుకు మోక్షం వచ్చింది. గుంతల మయంగా తయారైన ఈ మార్గంలో ప్రయాణం నరక యాతనపై రెండు నెలల క్రితం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో రోడ్డు నిర్మాణ పనులకు రూ.6.20కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఆ నిధులతో రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిం చారు. రేణిగుంట కుర్రకాలువ నుంచి పాపానాయుడుపేట, వికృతమాల, తొండమనాడు మీదుగా గ్రామీణ రోడ్లను కలుపుతూ శ్రీకాళహస్తి వరకు ఈ నిర్మాణ పనులు జరగనున్నాయి. ఈ పనులను ఆర్అండ్‌బీ ఈఈ రెడ్డయ్య, జెఈ ప్రమీల, వర్క్ఇన్‌స్పెక్టర్ మురగయ్యానాయుడు పరిశీలించారు. ఈ రోడ్డు నిర్మాణ పనులు పూర్తయితే ఈ మార్గంలో వాహనదారులకు, గుడిమల్లం ఆలయానికి వెళ్లే భక్తులకు ఇన్నిరోజులు పడిన తిప్పలు తప్పినట్లే.

దళితుల పొలాల దారి ఆక్రమణలను తొలగించండి


తహసీల్దార్‌కి వినతిపత్రం అందజేస్తున్న ఓబుల్‌రాజు కండ్రిగ దళితులు

పిచ్చాటూరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ఓబుల్‌రాజుకండ్రిగ దళితుల భూములకు వెళ్లే దారిని ఆక్రమణదారుల నుంచి విడిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి, సభ్యులు దాసరి జనార్దన్ కోరారు. ఈ మేరకు సోమవారం దళితులతో కలసి తహసీల్దార్ రమేష్ బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జనార్దన్, పిచ్చాటూరు మండల నాయకులు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ గోవర్దనగిరి రెవెన్యూలో సర్వే నెం.66, 67లలో 40 మందికిపైగా దళితులకు 2011లో అప్పటి ప్రభుత్వం డీకేటీ పట్టాలను ఇచ్చిందని తెలిపారు. ఆ భూములకు వెళ్లేందుకు 30 లింకుల బాటను ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. ప్రస్తుతం గోవర్దనగిరి గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు పురుషోత్తం నాయుడు ఆయన కుమారుడు బాలాజీ నాయుడు దారిని ఆక్రమించారని తెలియజేశారు. తహసీల్దార్ స్పందిస్తూ మాట్లాడుతూ సర్వేచేసి ఆక్రమణలు తొలగిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నారాయణ వనం మండల నాయకులు మునిశంకర్, ఓబుల్‌రాజు కండ్రిగ దళితులు మాతయ్య, మణికంఠ, రమేష్‌బాబు, మురళి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ హెల్పర్ పోస్టులకు నాలుగు దరఖాస్తులు

సత్యవేడు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఖాళీగా ఉన్న మూడు అంగన్వాడీ హెల్పర్ పోస్టులకు సంబంధించి నాలుగు దరఖాస్తులు అందాయని సీడీపీవో దేవకుమారి తెలిపారు. వరదయ్యపాళెం మండలం పులివెల్లం అంగన్వాడీ కేంద్రం హెల్పర్ పోస్టుకు రెండు దరఖాస్తులు, రామిరెడ్డిపాళెంకు ఒకటి, సత్యవేడు మండలం కొల్లడానికి ఒకరు దరఖాస్తు చేసుకున్నట్లు ఆమె వివరించారు.

కబ్జాదారుల నుంచి మా ఇంటి స్థలాన్ని కాపాడండి


నిరసన తెలుపుతున్న బాధితులు

శ్రీకాళహస్తి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): తమ ఇంటి స్థలాన్ని కొందరు దౌర్జన్యంగా ఆక్రమిస్తున్నారని ప్రశ్నించిన తమపై దాడులకు తెగబడుతున్నారని ఓ కుటుంబం ఆవేదన వ్యక్తం చేసింది. బాధితురాలి కథనం మేరకు.. శ్రీకాళహస్తి మండలం పుల్లారెడ్డి కండ్రిగ గ్రామానికి చెందిన ఈశ్వరమ్మ అనే వృద్ధురాలికి గ్రామంలో కొంత భూమి ఉంది. సుమారు 50 ఏళ్ల నుంచి ఆ స్థలంలోని కొంత భాగంలో ఇల్లు నిర్మించుకుని అక్కడే జీవనం సాగిస్తున్నారు. అయితే ఇటీవల రెండు రోజుల క్రితం గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ఈశ్వరమ్మ స్థలంలో మట్టి వేసి చదును చేశారు. తన ఇంటి స్థలంలో ఇలా ఎందుకు దౌర్జన్యంగా మట్టి తోలుతున్నారని వృద్ధురాలి కుటుంబ సభ్యులు నిలదీశారు. అయితే ఎంత వారిస్తున్నా లెక్కచేయకుండా తన ఇంటి పక్కన ఉన్న స్థలంలో అక్రమంగా చొరబడుతున్నారని వృద్ధురాలు కుటుంబ సభ్యులతో కలిసి తన స్థలం నిరసనకు దిగింది. దీనిపై రెవెన్యూ అధికారులకు రెండు రోజుల నుంచి ఫిర్యాదు చేస్తున్నా ఎవరూ స్పందించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

నేడు కిషోరి వికాసం శిక్షణ

కేవీబీపురం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆదర్శ పాఠశాలలో మంగళవారం కిషోరి వికాసం శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాధారాణి తెలిపారు. ఈ మేరకు సోమ వారం ఓ ప్రకటన విడుదల చేశారు. మండలంలోని అధికారులు, అంగన్వాడీలు, సచివాలయ సిబ్బంది, విద్యా సహాయక సిబ్బంది, ఏఎన్ఎంలు పాల్గొనాలని కోరారు.

సీసీరోడ్డు పనులను వేగవంతం చేయాలి

ఏర్పేడు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించి పూర్తిచేయాలని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ సూచించారు. అంజమేడు పంచాయతీలో జరుగుతున్న మినీ గోకులం పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 8వ తేదీ లోపు మిగిలిన గోకులం పనులను పూర్తిచేయాలని ఆదేశించారు. అనంతరం పంచాయతీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం దేవరి, పంచాయతీ రాజ్ ఇంజనీర్ రవితేజ తదితరులు పాల్గొన్నారు.

కుంగుతున్న అంగన్వాడీ కేంద్రం ఫ్లోరింగ్



కేవీబీపురం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పవనివారికండ్రిగ గ్రామంలో నిర్మించిన అంగన్వాడీ కేంద్రం ఫ్లోర్ భాగం కుంగిపోతోంది. దీంతో ఎక్కడికక్కడ బీటలు వారి రాళ్లు లోపలకు వెళ్లి ప్రమాదభరితంగా మారింది. పిల్లలకు ప్రమాదం జరుగుతుందేమోనని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ఫ్లోర్‌ను బాగుచేయించాలని కోరుతున్నారు.

ఘనంగా రాస్ మునిరత్నం జయంతి


అన్నదానం చేస్తున్న రాస్ సిబ్బంది

శ్రీకాళహస్తి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పానగల్‌లో గల రాస్ మహిళా వాణి కార్యాల యంలో సోమవారం రాస్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి పద్మశ్రీ డాక్టర్ గుత్తా మునిరత్నంరెడ్డి 89వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అన్నదానం చేశారు. పొదుపు సంఘాల సంచాలకులు నాగరాజు, సిబ్బంది వినోద్, ముకేష్, షబ్నా, మీనా, జయలలిత, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంట: మండలంలోని రాస్ కార్యాలయంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఎన్వీ అరవింద కంటి ఆస్పత్రి సౌజన్యంతో ఈ శిబిరం జరిగింది. కంటి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. రక్తదాన శిబిరం నిర్వహించారు. అనంతరం పేదలకు దుప్పట్లు, చేతికర్రలు, బియ్యం, పప్పులు పంపిణీ చేశారు. తర్వాత అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో రాస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ వెంకటరత్నం, సంయుక్త కార్యదర్శి మమత, డాక్టర్లు చైతన్య, వంశీకృష్ణ ఆర్గనైజర్లు, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడు: రాస్ పాపానాయుడుపేట శాఖలో పద్మశ్రీ డాక్టర్ మునిరత్నం జయంతి వేడుకలను నిర్వహించారు. ప్రాజెక్టు అధికారి బాలాజీరెడ్డి రైతులకు మహిళలకు రుణాల పంపిణీ చేశారు. వృద్ధులకు దుప్పట్లు, చేతికర్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అన్నాదొరై, వెంకట్‌కుమార్, జయప్రకాష్, సురేష్, నాగరాజు, శబరీదేవి, భారతి, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

పనసకోన-కన్నలి కాలువకు మోక్షం


కన్నలికాలువలో పూడిక తీస్తున్న హిటాచి

శ్రీకాళహస్తి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి పట్టణ శివారులోని పనసకోన నుంచి తొట్టంబేడు మండలం కన్నలి చెరువు వరకు ప్రవహించే కాలువకు ఎట్టకేలకు మోక్షం లభించింది. రాజీవ్‌నగర్‌లోని కైలాసగిరి కొండల్లో నుంచి ప్రారంభమయ్యే ఈ కాలువ కన్నలి చెరువు వరకు చేరుతుంది. సుమారు 4 కిలోమీటర్ల పొడవున ఉండే ఈ కాలువలో ఇటీవల నీటి ప్రవాహం తగ్గిపోయింది. పదేళ్ల క్రితం అప్పటి మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ఈ కాలువలో పూడిక తీయించారు. ఆ తరువాత ఎవరూ పట్టించుకోకపోవడంతో కాలువ వ్యర్థాలతో పేరుకుపోయింది. దీంతో రెండు రోజుల క్రితం ఈ కాలువలో పూడిక తీసే పనులను ఇరిగేషన్ అధికారులు చేపట్టారు.

దివ్యాంగుల పింఛన్ల పరిశీలన

రేణిగుంట, జనవరి 6(ఆంధ్రజ్యోతి) : మండలంలో దివ్యాంగుల పింఛన్ల పరిశీలన సోమవారం జరిగింది. తొలివిడతగా అత్తూరు, సూరప్పకాశం, గాజులమండ్యం, జీపాళెం పంచాయతీ పరిధిలో దివ్యాంగుల పింఛను తీసుకుంటున్న 31 మంది లబ్ధిదారుల వివరాలు సేకరించి పరిశీలించారు. నెల్లూరుకు చెందిన ప్రభుత్వ వైద్యులు అనీల్‌బాబు, రాధిక, ప్రకాష్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్లు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.